తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త







## యాళివాహనంపై దేవదేవుడు

చౌడేపల్లి, మే 15 ప్రభాతవార్త



అభీష్టధ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం దేవదేవుడు యాళివాహనంపై ఊరేగాడు. ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్‌దీక్షితులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. వాహనసేవకు పట్టణానికి చెందిన అశోక్, సుదర్శన్‌లు ఉభయదారులుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

## చిత్తూరులో భారీ వర్షం

### ఎండ నుండి ప్రజలకు ఉపశమనం



కొంగారెడ్డిపల్లి గాండ్లపల్లి పాఠశాల వద్ద కూలిన చెట్టు

చిత్తూరు రూరల్, మే 4 ప్రభాతవార్త:

చిత్తూరు, దాని పరిసర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం 3 గంటల నుండి భారీ వర్షం కురిసింది. గత నెల రోజులుగా తీవ్ర ఎండలతో ఉక్కిరి బిక్కిరి అయిన ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కల్పించింది. మార్చి నెల మధ్య నుండి జిల్లాలో భారీ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఎండలు తీవ్రంగా వుండటంతో గత నెల రోజుల నుండి ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు రోడ్లపై కన్పించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఆదివారం ఒక్కసారిగా ఒక ఒక గంట పాటు ఓ స్థాయిలో వర్షం కురవడంతో ప్రజలకు ఎండల నుండి భారీ ఉపశమనం కల్గించినట్లైంది. ఈ వర్ష సమయంలో చిత్తూరు, దాని పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఈదురు గాలులు వీచాయి. చిత్తూరు కొంగారెడ్డిపల్లి గాండ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ వర్షానికి పెద్ద చెట్టు నేల కూలింది. చిత్తూరు నగర పరిధిలోని కొన్ని ప్రధాన రోడ్లలో చిన్న చెట్లు నేల కూలడంతో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడింది. చిత్తూరు పరిసర ప్రాంతాలైన యాదమరి, బంగారుపాళ్యం, గుడిపాల, తవణంపల్లి మండలాల్లో సైతం ఓ మోస్తరు వర్షం కురవడంతో అక్కడి ప్రజలు ఎండల నుండి ఉపశమనం పొందారు. చిత్తూరు పరిసర ప్రాంతాల్లో సైతం పెద్ద ఎత్తున గాలులు వీయడంతో మామిడి పంటకు తీరని నష్టం వాటిల్లింది. ఇప్పటికే పంట సరిగా లేదని బాధపడుతున్న రైతులకు ప్రస్తుత ఆకాల వర్షంతో మరింత నష్టం కలుగనుంది.

## తిరుపతిలో గాలివాన బీభత్సం..

### - నేలకూలిన వృక్షాలు.. విరిగిన విద్యుత్ స్థంభాలు !!
### - రెండుకార్లు.. నాలుగు టు వీలర్లు ధ్వంసం.. భారీ నష్టం !!



తిరుపతి, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి

మండే ఎండలకు ఉపశమనంగా ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా గాలివాన భీభత్సం సృష్టించింది. ఎండలనుంచి వరుణదేవుడు కరుణించాడని జనం సంబరపడేలోపు తిరుపతి నగరం లో చాలాచోట్ల గాలిధాటికి భారీ చెట్లు నేలకూలాయి. వాటికి అనుబంధంగా ఉన్న విద్యుత్ స్థంభాలు విరగడం, నేలవాలడంతో విద్యుత్ వేర్లు తెగి కిందకుపడ్డాయి. దీంతో ఒక్కసారిగా నగరంలోని అనేక కాలనీలు చీకటిమయంగా మారాయి. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో మొదలైన బలమైన వానకు గాలి తోడైంది. దీంతో గంట సమయం కురిసిన వానకు, ఈదురుగాలుల ధాటికి భారీగానే నష్టం వాటిల్లింది. ప్రధాన ప్రాంతం పెద్ద కాపు లేఔట్, గంగమ్మగుడి, డిఆర్ మహల్, కర్నాల వీధి, దొడ్డాపురం వీధి, టాటానగర్ తదితర ప్రాంతాల్లో చెట్లు కూలాయి. దీంతో ఆయా చోట్ల కార్లు, స్కూటర్లు భారీగా ధ్వంసమయ్యాయి. వెంటనే విద్యుత్ అధికారులు సరఫరా నిలిపేశారు. మధ్యాహ్నం 1గంటనుంచి రాత్రి 11గంటల దాకా చెట్లు తొలగించడం, విద్యుత్ స్థంభాలు నుంచి లైన్లు పునరుద్ధరణ కాలేదు. అర్ధరాత్రి దాకా తిరుపతి నగరంలో అనేక ప్రాంతాలు, కాలనీలు చీకట్లో అలమటించాయి. భారీగా కూలిన చెట్లను తొలగించేందుకు నగర పాలక సంస్థ కమీషనర్ మౌర్య, హెల్త్ అధికారి, విద్యుత్ అధికారులు దాదాపు తొమ్మిది గంటలకు పైగా శ్రమించారు. ఆదివారం కావడంతో జనం ఇళ్లలోనే ఉండడంతో ప్రాణనష్టం జరగలేదు. ప్రజలకు ఇబ్బంది కలిగిన ప్రాంతాల్లో ఎపి యాదవ సంక్షేమం మరియు అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నరసింహా యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ తదితరులు పర్యటించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యుత్ పునరుద్ధరణ, చెట్లు తొలగించే కార్యక్రమాల్ని దగ్గరుంఇ పర్యవేక్షించారు. కర్నాల వీధి రైల్వే గేటు పక్కన ఓ మహావృక్షం నేలకూలడంతో అక్కడి కార్పోరేటర్ నరసింహాచారి పర్యవేక్షణలో తొలగించారు. 12వ డివిజన్ కార్పోరేటర్ ఎస్‌కె బాబు డిఆర్ మహల్ వద్ద పడ్డ చెట్లను తొలగించే కార్యక్రమాలు చేపట్టారు. తాతయ్య



గుంట గంగమ్మ ఆలయం రోడ్డులో ఆటో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. అలాగే ఓకారు, ఓఆటో, ఓ జీపు, రెండు బైకులు, రెండు దుకాణాలు దెబ్బతిన్నాయి. యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహా యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ మాట్లాడుతూ ప్రజలంతా గ ంగజాతర వస్తున్న సందర్భంగా తిరుపతిలో వర్షాలు పడడం సహజంగా జరుగుతుందన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినపుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో మాజీ కౌన్సిలర్ ఈతమాకుల హేమంత్‌కుమార్, నాగప్రతాప్, దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుధాకర్‌బాబు, సుబ్రమణ్యం, శరవణ, రామారావు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతి ...

నాయుడుపేట మే 4 ప్రభాతవార్త ;



నాయుడుపేట, ఓజిలి మండలాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షంలో పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేట మండలం వద్దిగుంట కండ్రిగలో రైతు అల్లం భాస్కర్(45), ఓజిలి మండలం గ్రద్దగుంట పంచాయతీ గొల్లపాలెం వద్ద మామిడి తోటలో వుండగా పిడుగుపాటుకు గురై కార్తీక్ (13) మృతిచెందారు. పంటపొలాల్లో వ్యవసాయ పనులు చేస్తూండగా ఒక్కసారిగా గాలివాన రావడం, దానికితోడుగా పిడుగులు పడటంతో పంటపొలాల్లో ఉన్న బాలుడు పిడుగుపాటుకు గురై మృతి చెందారు. దీంతో బాలుడి తల్లిదండ్రుల రోధన పలువురిని కంటతడి పెట్టించింది.

## విద్యుత్ షాక్‌తో జెఎల్‌ఎంకి తీవ్ర గాయాలు



తిరుపతిరూరల్, మే 4 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ మండలం చిగురువాడ గ్రామ పంచాయతీలో జూనియర్ లైన్‌మెన్ విధులుగా నిర్వర్తించే మురళి విద్యుత్ ప్రమాదానికి గురయ్యారు. ఆదివారం భారీ ఎత్తున వీచిన గాలికి సంస్కృత నగర్‌లో చెట్లకొమ్మలు విరిగి విద్యుత్ లైన్‌పై పడటంతో 33కెవి విద్యుత్ లైన్ తగిలి తీవ్రంగా గాయపడ్డారు. విద్యుత్ ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే పంచాయతీ కార్యధర్శి లక్ష్మీదేవి, సర్పంచ్ ప్రదీప్‌రెడ్డి హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకుని, స్థానికుల సాయంతో విద్యుత్‌లైన్‌పై నుంచి మురళిని కిందకుదించి, 108 వాహనంలో స్విమ్స్‌కు తరలించారు. స్విమ్స్‌లో ప్రాధమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరములోని ప్రవేట్ హాస్పిటల్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. తీవ్ర గాయపడిన లైన్‌మెన్ మురళికి భార్య ఇద్దరు పిల్లలు.

## ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలకు జనమే జనం

### అగ్నిగుండ ప్రవేశం, తెప్పోత్సవాలకు పోటెత్తిన భక్తులు - సాయంత్రం ఈదురు గాలుల భయం
### - వర్షం తగ్గడంతో ఉత్సవం యధాతథం - నేటితో బ్రహ్మోత్సవాలు ముగింపు





ధర్మరాజస్వామి ఆలయంలో జనం జనం, తెప్పోత్సవాలకు హాజరైన సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ

తడ, మే 4 ప్రభాతవార్త

గత నెల 23 నుంచి మొదలైన తడ మండలం వాటంబేడుకుప్పంలోని శ్రీ ధర్మరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు ఆదివారం జనం పోటెత్తారు. సెలవు రోజు కావడం, ముఖ్యమైన ఘట్టాలన్నీ ఇదేరోజు ఉండటంతో భక్తుల సందడి పెరిగింది. భారతంలోని కీలక ఘట్టం కురుక్షేత్రం, దుర్యోధన వధతో పాటు రాత్రి అగ్నిగుండ ప్రవేశం, తెప్పోత్సవాలు వైభవంగా నిర్వహించారు. కళ్లు మిరుమిట్లు గొలిపే బాణాసంచా వేడుకలు, కోలాట నృత్యాలు, విద్యుద్దీపాలంకరణలతో తిరునాళ్ల మెరిసిపోయింది. కాళికాశక్తి సింహ వాహనంపై అమ్మవారిని ఊరేగించారు. రాత్రి గుంటూరుకు చెందిన ఇబి స్వామి ఈవెంట్స్ వారిచే ఊరేగింపుగా డాన్సు ఏర్పాటు చేశారు. ఇదిలావుంటే ఈ ఉత్సవాలు సోమవారం ధర్మరాజుల పట్టాభిషేకం, శయన సేవ గ్రామోత్సవాలతో ముగుస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**తిరునాళ్లకు హాజరైన సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ**

వాటంబేడు బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం సూళ్లూరుపేట నెలవల విజయశ్రీ హాజరయ్యారు. ఇంతకుముందు కూడా ఆమె ఈ ఉత్సవాల్లో పాల్గొని వెళ్లారు. ఆదివారం ఎమ్మెల్యే వెంట పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఆలయంలో పూజల అనంతరం ఆమె తిరునాళ్ల ఘట్టాలను తిలకించారు. సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు.

## ప్రశాంతంగా నీట్ ప్రవేశ పరీక్ష

### - పరీక్షకు 33 మంది విద్యార్థులు గైర్హాజరు



నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు.

చిత్తూరు రూరల్, మే 4 ప్రభాతవార్త:

జిల్లా కేంద్రం చిత్తూరులో ఆదివారం ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో ఎన్‌ఇఇటి(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) ప్రశాంతంగా ముగిసింది. ఎన్‌ఇఇటి-2025 ప్రవేశ పరీక్ష చిత్తూరు పివికెఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్‌పిఎస్ సావిత్రమ్మ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రాల్లో నిర్వహించారు. ఈ ప్రవేశ పరీక్ష జరుగుతున్న తీరును కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలులు పరీక్షా కేంద్రాల్లో పర్యవేక్షించారు. పివికెన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో 432 విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సివుండగా 413 మంది విద్యార్థులు హాజరయ్యారు. పివికెఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో ఈ పరీక్షకు 19 మంది అభ్యర్థులు గైర్హాజరు అయ్యారు. అలాగే ఎన్‌పిఎస్ సావిత్రమ్మ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో 278 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సివుండగా 264 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కేంద్రంలో 14 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. అంటే చిత్తూరులో జరిగిన నీట్ ప్రవేశ పరీక్షకు 33 మంది అభ్యర్థులు గైర్హాజరు అయ్యారు. ఈ పరీక్షల నిర్వహణ కార్యక్రమంలో పివికెఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి, ఎన్‌పిఎస్ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మనోహర్, ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌భాషా, చిత్తూరు ఇన్‌ఛార్జీ డిఎస్పీ దేగల ప్రభాకర్, చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, పరీక్షల చీఫ్ సూపరిటెండెంట్ డాక్టర్ శరవణ, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయంలో పోటెత్తిన భక్తులు



కాణిపాకం, మే 4 ప్రభాతవార్త:

వరుస సెలవుల కారణంగా సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయం భక్తుల రద్దీ ఎక్కువైంది. వేసవి సెలవులు రావడం, ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు రావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు.

## అకాల వర్షం - అపారనష్టం ...

### అవస్థలు పడుతున్న అన్నదాతలు ...



పంటను కాల్లాల్లో తడవకుండా ప్లాస్టిక్ పట్టలతో కప్పుకుంటున్న దృశ్యం

నాయుడుపేట మే 4 ప్రభాతవార్త;

నాయుడుపేట, ఓజిలి, పెళ్ళకూరు, దొరవారిసత్రం మండలాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి అన్నధాతలకు అపారనష్టం వాటెళుతుంది. నియోజకవర్గంలోని పలుమండలాల్లో రైతులు వరి, మిరప, వేరుశెనగ పంటలను కోసి కల్లాల్లో ఆరపెడుతున్న తరుణంలో ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన గాలివాన కురవడంతో అన్నధాతలు అవస్తలు పడుతున్నారు. అకాల వర్షం కురవడంతో వరి, మిరప, వేరుశునగను వర్షానికి తడవకుండ ప్లాస్టిక్ పట్టలు కప్పుకుంటూ అవస్థలు పడుతున్న దృశ్యాలు ప్రజల హృదయాలను కలసివేస్తున్నాయి. రైతులు ఆరుగాలం కష్టపడి వేలకువేలు అప్పులుచేసి వ్యవసాయసాగు చేపట్టిన అన్నధాతలకు పంటచేతికందే దశలో అకాల వర్షాలు కురవడంతో అన్నధాతలు ఆంధోళన చెందుతున్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ

### భానుడి ప్రతాపంతో చిన్నారుల రోదనలు
### ఉక్కపోతతో అవస్థలు పడ్డ భక్తులు



శ్రీకాళహస్తి, మే 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వేసవి సెలవులకు భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు. ముఖ్యంగా తమిళనాడు, కర్నాటకల నుంచి విశేష సంఖ్యలోభక్తులు వస్తుంటారు. అయితే వారికి సదుపాయాల మాట దేవుడెరుగు. కనీసం క్యూలైన్లలో ఫ్యాన్లు లేదు. సభావేదికలపై మంత్రుల నుంచి అధికారుల వరకు భక్తుల సదుపాయాలకు పెద్ద పీట అని ప్రకటించుకోవటం తప్ప కనీసం క్యూలైన్లలో ఏసిలు కూలర్లు కాదు. ఫ్యాన్లు కూడా లేదు. ఆలయంలో నాలుగుకాలాల్లో అభిషేకాలు జరుపుతున్నారు. అభిషేకాల సమయంలో కనీసం ఒక గంట దర్శనాలకు బ్రేక్ ఉంటుంది. ఈ సమయంలో క్యూలైన్లలో ఉన్న భక్తుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది. అభిషేకాలు జరిగినపుడు నాలుగు సమయంలో నైవేద్యాలు జరుగుతాయి. అప్పుడు కూడా దర్శనం బ్రేక్ ఉంటుంది. అప్పుడు ఽకూడా భక్తుల తిప్పలు వర్ణనాతీతంగామారింది. ఒక్కసారి క్యూలైన్లో ప్రవేశిస్తే సాదాసీదాగా దర్శనాలకు వెళితే కనీసం ఒకటిన్నర గంట పడుతుంది. దాంతో క్యూలైన్లలో ప్రవేశించిన తరువాత కనీసం ఫ్యాన్లు లేకుండా ఉక్కపోతతో పసిపిల్లల రోదనలు, వృద్దుల అసంతృప్తి వర్ణనాతీతంగామారింది. వేసవి సమయంలో రద్దీ అధికంగా ఉంటుందనే అంశం అధికారులకు తెలియనిది కాదు. కానీ భక్తుల నుంచి రాబడి తప్ప వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి పట్టించుకోవటం లేదనే విమర్శలు బాహాటంగా ఉన్నాయి.

**సెల్లార్లు అనుమతికి ఎంత కాలం?**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు సకల సదుపాయాలు కల్పించుటకు రెండవ గోపురం వద్ద భారీ ఎత్తున సెల్లార్లు ఏర్పాటుకు శివరాత్రి సమయంలో షెడ్డులు నిర్మించారు. ఇక్కడ అన్ని సేవలకు సంబంధించిన టిక్కెట్లు కౌంటర్లు, భక్తులు సెద తీరటానికి చక్కటి ఫ్యాన్లతో ప్రణాళికలు రూపొందించారు. తిరమల లోని సెల్లార్లలా భక్తులు కూర్చొటానికి అక్కడ కాలక్షేపానికి టివిలు ఏర్పాటుకు సిద్దం చేసారు. ఈ ప్రతిపాదనల అమోదానికి కమిషనర్ కార్యాలయానికి పంపారు. కానీ రోజులు గడుస్తున్నా, వేసవి సగానికి వచ్చినా కమిషనర్ కార్యాలయం నుంచి అనుమతి లభించలేదు. అనుమతి వచ్చిన వెంటనే పనులు నిర్వహణకు ఇంజనీరింగ్ శాఖ సిద్దంగా ఉన్నారు. అప్పటి వరకు అధికారులు క్యూలైన్లలో కనీసం ఫ్యాన్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అభిప్రాయం భక్తుల నుంచి వ్యక్తమౌతుంది.

# ఆలయ కుంభాభిషేకంలో ఎమ్మెల్యే

గుడిపాల, మే 4 ప్రభాతవార్త:
మండలంలోని పాపసముద్రం పంచాయతీ పిళ్ళారికుప్పం గ్రామంలో నూతనంగా నిర్మించిన ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామివారి ఆలయ కుంభాభిషేక కార్యక్రమంలో ఆదివారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పాల్గొన్నారు. ఆలయ కుంభాభిషేక కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడును వేద పండితులు, గ్రామ పెద్దలు, తెలుగుదేశం నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, ఉపాధ్యక్షులు అనిల్ కుమార్, తెలుగు యువత అధ్యక్షుడు హేమాద్రి, ఎంపిటిసి హరిప్ర



సాద్, స్థానిక సర్పంచ్ చిట్టిబాబు, తెలుగుదేశం నాయకులు గణేష్, అర్జున్, పయణి, గజేంద్ర, రవినాయుడు, బాల, హైజాక్, గుణ శేఖర్, ఆలయపెద్దలు, గ్రామస్తులు, అధికసంఖ్యలో భక్తులుపాల్గొన్నారు.

**వైకాపా ఇన్‌ఛార్జ్ విజయానందరెడ్డి ప్రత్యేక పూజలు**

చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జ్ విజయానందరెడ్డి ఆదివారం మండలంలోని పిళ్ళారికుప్పం గ్రామంలో నూతనంగా నిర్మించిన ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామివారి ఆలయ మహా కుంభాభిషేక ఉత్సవానికి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మహాకుంభాభిషే కార్యక్రమానికి విచ్చేసిన ఎంసి విజయానందరెడ్డిని స్థానిక సర్పంచ్ చిట్టిబాబు, ఆలయ పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎంసి విజయానందరెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైకాపా పార్టీ అధ్యక్షులు ప్రకాష్, సర్పంచ్ రజనీకాంత్, వైకాపా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వరసిద్దుని సన్నిధిలో శ్రీకాళహస్తి ఆలయ ఈఓ



**కాణిపాకం, మే 4 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఈఓ టి.బాపిరాజు ఆదివారం కుటుంబసమేతంగా కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారి వెంట ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నారసింహనపల్లెలో ఘనంగా మహాభారత యజ్ఞం ప్రారంభం

**తవణంపల్లె, మే 4 ప్రభాతవార్త:** మండలంలోని నారసింహనపల్లె గ్రామంలో మహాభారత యజ్ఞం కార్యక్రమం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. నారసింహనపల్లె గ్రామంలో ఈనెల 4 నుండి 21 వరకు 18 రోజుల పాటు మహాభారత యజ్ఞం కార్యక్రమం జరుగనుంది. ఈమేరకు ఆదివారం ఈకార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ఉదయం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం మహాభారత యజ్ఞం ప్రారంభ సూచికంగా ఆలయం వద్ద ధ్వజారోహణం కార్యక్రమంను నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ఎస్.శివకుమారి భాగవతారిణిచే హరికథా కాలక్షేపం నిర్వహించారు. ఈమేరకు గ్రామంలో ఈనెల 4 నుండి 21 వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం హరికథా కాలక్షేపం, ఈనెల 10 నుండి 21 వరకు పీలేరు శ్రీవెంకటేశ్వర నాట్యకళామండలి వారిచే వీధి నాటకాలు జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని గ్రామస్థులు కోరారు.

## కోడిగుట్టలో ఘనంగా రాజమాతంగి ఆలయ మహా కుంభాభిషేకం

**చిత్తూరు రూరల్, మే 4 ప్రభాతవార్త:** చిత్తూరు నగరం మురకంబట్లు సమీపంలోని కోడిగుట్ట కుప్పన్న గారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరాజమాతంగి ఆలయ మహా కుంభాభిషేకం ఆదివారం అత్యంత ఘనంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రముఖ వైకాపా నాయకులు కోడిగుట్ట వెంకటేశు ఆధ్వర్యంలో కుప్పన్నగారిపల్లెలో కోరిన కోర్కెలు తీరేచ్ఛ శ్రీరాజమాతంగి ఆలయంలను నూతనంగా నిర్మించారు. ఈ ఆలయ మహా కుంభాభిషేకం ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుమారు ఏడు అడుగుల ఎత్తైన అమ్మవారి చిత్రపటాన్ని ప్రతిష్టించి శాస్త్రోక్తంగా కుంభాభిషేకం నిర్వహించారు. ఈమేరకు అర్చకులు, రుత్వికులు ఆలయంలో గణపతి హోమం, కలశస్థాపన, పుణ్యాహవాచనం, వినాయకుని ప్రతిష్ట, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈసందర్భంగా రుత్వికులు మాట్లాడుతూ ప్రపంచశాంతి, గ్రామంలో అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు కలిగి వుండాలని అమ్మవారి కృప ప్రజలపై వుండాలని అమ్మవారి ఆలయాన్ని నిర్మించినట్లు ఆలయ ధర్మకర్త కోడిగుట్ట వెంకటేశు తెలిపారు. వైకాపా నాయకులు విజయానందరెడ్డి, కోడిగుట్ట వెంకటేశు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పెద్దిరెడ్డిచే ఉరుషే షరీఫ్ పోస్టర్ల ఆవిష్కరణ



**చౌడేపల్లి, మే 15 ప్రభాతవార్త** మండలంలోని దుర్గ సముద్రం పంచాయతీ దాదేపల్లిలో మే 24, 25 తేదీల్లో ఉరుషే షరీఫ్‌ను నిర్వహించనున్నారు. ఈమేరకు ఆదివారం మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిచే తిరుపతిలో పోస్టర్ల ఆవిష్కరణ జరిగింది. మండల వైకాపా అధ్యక్షుడు గౌడప్ప గారి నాగభూషణరెడ్డి, జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, దాదేపల్లి ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## పొలాల్లో గుర్తు తెలియని శవం

**గంగవరం, మే 4 ప్రభాతవార్త** మండలంలోని నడింపల్లి గ్రామ సమీపంలో రోడ్డు పక్కన పొలాల్లో ఓ గుర్తు తెలియని మగ వ్యక్తి శవాన్ని గుర్తించినట్లు అర్బన్ సిఐ తెలిపారు. మృతుడికి సుమారు 55-58 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. మృతుడ్ని గుర్తించిన వారు 9440796735నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.

## పెహల్గాం కారకులను శిక్షించాలి



**పుంగనూరు రూరల్, మే 4, ప్రభాతవార్త** పట్టణంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో జమ్మూ కాశ్మీర్ పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పిస్తూ శాంతిరాలి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదం నశించాలి నినాదాలు చేశారు. ఉగ్రదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, ఉగ్రవాదులను సహకరించి ప్రోత్సహించిన వారికి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం నాలుగు గంటలకు నగిరి ప్యాలెస్ నుంచి ప్రారంభమై ర్యాలీ శాంతియుతంగా జరిగింది హిందూ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ప్రిస్క్రిప్షన్ లేనిదే మందులు ఇవ్వద్దు

పుంగనూరు, మే 4, ప్రభాతవార



మత్తు కలిగించే ఎటువంటి మాత్రలు సిరప్లను డాక్టర్ సలహా లేనిదే విక్రయించవద్దని సిఐ సుబ్బరాయుడు సూచించారు. ఆదివారం ఆయన పట్టణంలోని కెమిస్ట్‌లు, మెడికల్ షాపుల యజమానుల సమావేశం నిర్వహించి యువత ట్యాబ్లెట్ రూపంలో మరియు సిరప్ రూపంలో మత్తుకు బానిస అవుతున్నందున దాన్ని దృష్టిలో పెట్టుకొని ఏ మెడికల్ షాపు యజమాని అయిన సంబంధిత డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా నిషేధిత మత్తు కలిగిన టాబ్లెట్లను, సిరప్‌లను అమ్మకూడదని ఒకవేళ అమ్మినట్లు అయినా వారి పైన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బలిజలు ఐకమత్యంతో ముందుకు సాగుదాం



**సోమల, మే 4, ప్రభాతవార్త** బలిజ కులస్తులు ఐకమత్యంతో ముందుకు సాగి పలువురికి ఆదర్శంగా నిలవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం శ్రీకృష్ణదేవరాయ సర్కిల్లో విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ చేసిన అనంతరం మార్కెట్ యార్డ్ సమీపంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వందలాదిమంది బలిజ కులస్తులు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేశారు. అతి త్వరలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కార్యనిర్వకులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా నల్లపు ముని వెంకటప్ప, గౌరవాధ్యక్షులుగా గాజుల హరినారాయణ, కోశాధికారిగా కర్రీ జ్యోతిశ్వరుడు లను ఎన్నుకున్నారు. పార్టీలకతీతంగా బలిజ సోదరులు ఐక్యంగా ముందు సాగడం శుభపరిణామం అని సోమల సురేష్ అన్నారు. మొదటగా తన వంతుగా రెండు లక్షల రూపాయలు చెక్కును కార్య నిర్వాహకులకు అందజేశారు. గన్న మదన్మోహన్ బాబు లక్ష రూపాయలను, టీచర్ ప్రసాద్ లక్ష రూపాయలను కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మండలవోని 15 పంచాయతీలకు చెందిన కులస్తులు పాల్గొన్నారు.

## నడిరోడ్డులో ఆటోలు: ట్రాఫిక్‌కు ఇక్కట్లు



**శ్రీకాళహస్తి,మే 4 ప్రభాతవార** శ్రీకాళహస్తి టూటౌన్ పరిధిలో రోడ్డుకడ్డంగా ఆటోలు పార్కింగ్, సంచారంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని వాహన చోదకులు వాపోతున్నారు. ముఖ్యంగా టూటౌన్ పరిధిలోని బహదూరుపేటలోని పెట్రోల్ బంకు పట్టణ నడిబొడ్డులోని కొత్తపేట బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆటోల ఆగడాలు శృతి మించుతున్నాయని వాపోతున్నారు. తెట్టు టర్నింగ్ వద్ద రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ చేయటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గుతుంది.ఆటో వాళ్ళకు డివైయస్‌పి ఎన్ని సార్లు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా ఆటోల చోదకుల తీరులో మార్పు రావటం లేదని వివరిస్తున్నారు.ఇక పట్టణంలో అయితే నాలుగుమాడావీధుల్లో ఖాళీ ఆటోలు సంచరిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గిస్తున్నా పట్టించుకోవటం లేదని వాపోతున్నారు.

## జనసేనలో చేరిన అడవిబూదుగూరు యువకులు



**కుప్పం, మే 4 ప్రభాతవార్త** మండలంలోని అడవి బూదుగూరుకు చెందిన ఇరవై మంది యువకులు ఆదివారం కుప్పం జనసేన ఇన్‌చార్జ్ నరేష్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. డి.సిఎం పవన్ కళ్యాణ ఆశయాలు, నాయకత్వానికి ఆకర్షితులై తాము జనసేనలో చేరినట్లు వారు తెలిపారు. ఇన్‌చార్జ్ నరేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి జనసైనికుడు కృషి చేయాలన్నారు. సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ద్వారా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల వద్దకు మరింత బలంగా తీసుకెళ్లాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జనసేన నేతలు పవన్ మహేష్, పాండు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ కదిరినరసింహస్వామి జాతర



**కుప్పంరూరల్, మే 4 ప్రభాతవార్త** మండలంలోని ఊరినాయనపల్లి గ్రామంలో వెలసిన శ్రీ ఆవుల మల్లయ్య, శ్రీ కదిరి నరసింహస్వామి జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్పపల్లకిలో గ్రామంలో ఊరేగించారు. మహిళలు స్వామివారికి పొంగళ్లు సమర్పించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎర్రమల్లప్పనాయుడు, గ్రామపెద్ద శీనప్పనాయుడు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆలయంలో ఉంగరం పోగొట్టుకున్న భక్తుడు.. తిరిగి అప్పగింత



**రామకుప్పం, మే 4 ప్రభాతవార్త** స్థానిక శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయంకు గత మార్చి 30వతేదిన ప్రవీణ్‌కుమార్ అనే భక్తుడు వచ్చి ఉంగరం పోగొట్టుకున్నాడు. ఈ విషయంగా వారం క్రితం ఆలయం వచ్చి తాను ఉంగరం పోగొట్టుకున్న విసయం ఆలయ కమిటీ పెద్దలు సీతాపతికి తెలియజేయగా ఉంగరం పురోహితులు వాసు స్వామికి లభించగా దాన్ని మరలా పోగొట్టుకున్న భక్తుడు ప్రవీణ్‌కు అప్పగించారు. దీంతో అతను వారికి కృతజ్ఞతలు తెలిపాడు.

## తేనెటీగల దాడిలో మహిళలకు తీవ్ర గాయాలు



చౌడేపల్లి, మే 4 ప్రభాతవార్త తేనెటీగల దాడిలో మహిళకు తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధితురాలి కథనం మేరకు...చౌడేపల్లి పరిధిలోని గడ్డంవారిపల్లి రోడ్డువైపు వున్న ఎస్టీ కాలనీకి చెందిన సరస్వతమ్మ, కృష్ణప్పలు కూలీ పనులు చేసుకొంటూ జీవిస్తున్నారు. ఈక్రమంలో మదుకూరు వద్ద మామిడితోటలో కాయలకు కవర్లు కట్టే పనికి వెళ్ళారు. అక్కడ భార్యభర్తలిద్దరూ కడుతుండగా పెద్దపోరు తేనెటీగలు ఒక్కసారిగా వారిపై దాడి చేసాయి. ఈ దాడిలో సరస్వతమ్మకు తీవ్ర గాయాలు కాగా కృష్ణప్ప స్వల్పగాయాలతో బయటపడ్డాడు. వారిద్దరినీ స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సరస్వతమ్మ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో 108సేవల ద్వారా పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

**కుప్పం, మే 4 ప్రభాతవార్త** కుప్పం నియోజకవర్గ స్థాయిలో ప్రతి సోమవారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని మే 5వతేది అనివార్య కారణాలతో రద్దు చేసినట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

## యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



**చిత్తూరు రూరల్, మే 4 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లాలో ఇటీవల విడుదలైన టెన్త్ పరీక్షా ఫలితాల్లో 500 మార్కులకు పైగా సాధించిన యాదవ విద్యార్థిని విద్యార్థులకు యాదవ ఎంప్లాయిస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం టిటిడి కళ్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సమావేశంలో యాదవ ఎంప్లాయిస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు లింగమూర్తి మాట్లాడుతూ గతంలో ఈ పురస్కారాలు కొన్ని ప్రాంతాల విద్యార్థులకే పరిమితం చేసి ఇచ్చేవారమని, ఈ ఏడాది నుండి జిల్లా వ్యాప్తంగా టెన్త్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన యాదవ విద్యార్థులందరికీ పురస్కారాలు ఇవ్వాలని నిర్ణయించి ఇంత పెద్ద కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. యాదవ్ ఎంప్లాయిస్ సొసైటీ గౌరవ అధ్యక్షులు చిట్టిబాబు కొల్ల మాట్లాడుతూ టెన్త్ క్లాస్‌లో ఉత్తమ ప్రతిభ చూపి మంచి మార్కులు సాధించిన విద్యార్థులందరు ఉన్నతంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కవిత, సురేష్, కోదండ యాదవ్, అశోక్ ఆనంద్‌యాదవ్, నాగరాజ్ యాదవ్, నవీన్ యాదవ్, శ్రీరామ్మూర్తి, చెంగ్రాయమందడి, లక్ష్మీపతియాదవ్, గురప్రసాద్, దేవేంద్ర, గురుమూర్తి, వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.

## జిల్లా వైకాపా ఉపాధ్యక్షుడికి సన్మానం



**శ్రీరంగరాజపురం, మే 4 ప్రభాతవార్త:** ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ గురువారెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకుని ఆదివారం ఆయనను వైకాపా నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. 49 కొత్తపల్లిమిట్టలో వైకాపా కో-అప్షన్ సభ్యుడు యేసురత్నం, కొత్తపల్లి యువత కలిసి కేక్ కట్ చేసి గురువారెడ్డికి తినిపించారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మాజీ డైరెక్టర్ గోవిందరెడ్డి, కొత్తపల్లి థామస్, మునిచంద్ర, తెరిసా శ్యామ్, తేజ, కొత్తపల్లి యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 7నుంచి ఊరందూరు చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి రూరల్,మే 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న శ్రీదేవి,భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 7 బుధవారంతో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విస్తృతస్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక్కడ ఉత్సవాలకు సంబంధించి స్థానిక శాసనససభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆలయాధికారి డి.బాపిరెడ్డితో చర్చించారు.అలాగే స్థాని అర్చకులుతో ఉత్సవాల నిర్వహణాకు సంబంధించి చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్యకు దిశ దిశ నిర్దేశం చేసారు. ఇక్కడ ఉత్సవాలకు సంబంధించి ఇఓ డి.బాపిరెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మొదటి రోజు కార్యక్రమాలకు ఉభయదారుడుగా గ్రామానికి చెందిన కాపిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఉన్నారు.

**ఉత్సవాల వివరాలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఊరందూరు గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఇలా తెలిపారు. ఈ నెల 7న ధ్వజారోహనం హంసవాహన సేవ ఉంటుందన్నారు.కాగా మే 8న తిరువాచ్చి ఉత్సవం శేష వాహనం ఉంటఉందన్నారు. మే 9న తిరువాచ్చి ఉత్సవం హనుమంత సేవ,10న సూర్యప్రభ ఉత్సవం సింహవాహన సేవ, 11న గిన్నెబిక్ష-మోహిని ఉత్సవం గరుడ సేవ, 12న తికెవాచ్చి ఉత్సవం కళ్యాణోత్సవం,గజవాహన సేవ, 13న వసంతోత్సవం,రథోత్సవం, 14న తిరువాచ్చి ఉత్సవం పల్లకి సేవ, 15న పార్వేట ఉత్సవం అశ్వవాహన సేవ, ధ్వజావరోహణం, 16న శాంతి అభిషేకం ఏకాంత సేవ నిర్వహించబడుతుందని వివరించారు.

## అంధకారంలో సోమల

**సోమల, మే 4, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన సోమల టౌన్ గత పది రోజులుగా అంధకారం అలుముకుని ఉంది. అంగట్లో అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని ఉన్నట్లు వీధి దీపాలు సక్రమంగా ఉన్న వాటిని వెలిగించే పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంతో అంధకారం నెలకొని ఉంది. ముఖ్యంగా పంచాయతీ కార్యాలయం నుంచి బజారు వీధి పూర్తిగా చీకటిమయమైంది. గత పది రోజులుగా స్వయం బీశ్వరుని బ్రహ్మోత్సవాలు నాలుగు మాడవీధుల్లో జరుగుతున్న పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఉభయ దారులు లైట్లను ఏర్పాటు చేసుకున్నారు. మరికొన్నిచోట్ల పట్టపగలు కూడా వీధి దీపాలు వెలుగుతున్న పట్టించుకున్ననాధుడు కరువయ్యారు. ఉన్నతాధికారులైన స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## క్యూలైన్‌లో సొమ్మసిల్లి పడ్డ వృద్ధురాలు

-మానవత్వం చాటుకొన్న ఇఓ ఏకాంబరం



**బోయకొండ(చౌడేపల్లి), మే 15 ప్రభాతవార్త** శక్తిక్షేత్రం బోయకొండకు కనీవినీ ఎరుగని రీతిలో భక్తులు చేరుకొన్నారు. దీంతో అమ్మవారి క్యూలైన్లు మెట్లకింద వరకు రద్దీగా కనిపించాయి. ఇలా వుండగా ఆలయ ప్రాంగణంలో గల క్యూలైన్‌లో కర్ణాటకకు చెందిన భక్తురాలు సొమ్మసిల్లి కిందపడిపోయింది. అక్కడే క్యూలైన్లను పర్యవేక్షిస్తున్న ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం వెంటనే గుర్తించి క్యూలైన్ల నుంచి ఆమెను బయటకు తరలించారు. కొంతసేపు సేద తీరిన అనంతరం రూ. 200ల క్యూలైన్ ద్వారా వృద్ధురాలికి అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. మానవత్వం చాటుకొన్న ఇఓ ఏకాంబరంను యాత్రీకులు ప్రశంసించారు.

## బోయకొండపై భక్తుల విరాళాలు

**బోయకొండ(చౌడేపల్లి), మే 15 ప్రభాతవార్త**



శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయానికి పలువురు విరాళాలందించారు. మండలంలోని పంచాయతీ కేంద్రం గడ్డంవారిపల్లి శ్రీరాములు తన తల్లిదండ్రులు నాగప్ప, సిద్దమ్మల జ్ఞాపకార్థం కుమార్తె పద్మప్రియ చేతులమీదుగా గోశాలకు రూ. 10,150లు, అదే విధంగా బెంగళూరు కేశవ, చైతన్యలు అన్నదానానికి రూ. 10వేలను ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరంకు అందించారు. దాతలకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించి, పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## ఇతిహాస గాథలు ఆధ్యాత్మికతను పెంచుతాయి

: మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



**వెదురుకుప్పం, మే 4 ప్రభాతవార్త :** విలువలను, ఆధ్యాత్మికతను ఇతిహాస గాథలు ప్రజలలో పెంపొందిస్తాయని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేర్కొన్నారు. శ్రీకృష్ణ ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయ వార్షికబ్రహ్మోత్సవాలకు ఆదివారం ఆయన హాజరుకావడంతో ఆలయధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి ఆలయ మర్యదపూర్వకంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి దుశాలువతో సన్మానించి తీర్థప్రసాదాలు, అమ్మవారి జ్ఞాప్తికను అందజేశారు. ఈయనతో పాటు వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి, జడ్పీటిసి సభ్యులు చలం పాళ్యం సుకుమార్, ఎంపీపీ బండి నాగరాణి హేమసుందర్ రెడ్డి, నాయకులు రామయ్య, బట్టే సుబ్రమణ్యం, మునికృష్ణా రెడ్డి, బొజ్జా రెడ్డి, నరేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే వైఎస్ఆర్‌సీపీ సత్యవేడు నియోజకవర్గం ఇన్‌చార్జ్ నూకతోటి రాజేష్ హాజరైన్నారు. ఆలయ కార్యనిర్వహక మండలి ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేపట్టి పురోహితులచే ఆశీస్సులు అందజేసి అమ్మవారి తీర్థప్రసాదాలు, దుశాలువతో సన్మానించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఆయనతో పాటు వైసీపీ నాయకులు రమేష్ రెడ్డి, చిరంజీవి రెడ్డి, వెంకటేష్, ప్రకాష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా మహిళా నాయకురాలికి మంత్రి, ఎమ్మెల్యే ఘన నివాళి



**చిత్తూరురూరల్, మే 4 ప్రభాతవార్త:** ఇటీవల మృతి చెందిన తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంటరీ మహిళా కార్యదర్శి డి. శ్రీదుర్గ చిత్రపటానికి మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు సిఆర్ రాజన్, ఇతర దేశం నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి, తెలుగుదేశం పార్టీ అన్ని రకాలుగా అండగా వుంటుందని భరోసా కల్పించారు. ఈ కర్మక్రియ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు విలేకరులతో ఎమ్మెల్యే ఇష్టాగోష్టి

**చిత్తూరురూరల్, మే 4 ప్రభాతవార్త:** చిత్తూరునగరం, లక్ష్మీనగర్ కాలనీ నందుగల ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటలకు విలేకరులతో శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ ఇష్టాగోష్టి నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలల కాలంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ది పనులపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గురుకుల పాఠశాల పరీక్ష



**సదుం, మే 4, ప్రభాతవార్త** స్థానిక జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 191 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 126 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలను జిల్లా కోఆర్డినేటర్, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కె. మునీంద్రయ్య తనిఖీ చేశారు. అదేవిధంగా పరీక్షలకు డిపార్మెంటల్ ఆఫీసర్‌గా జ్యోత్స్న వ్యవహరించగా పరీక్షలు నిర్వహణ అధికారిగా స్థానిక బిసి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించారు. ఈపాఠశాలలోఎంపీసీ, బైపీసీ, ఎంఈసి, సిఇసి లకు పరీక్ష జరిగిందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

## అవినీతికి పాల్పడ్డ వేనూతనపల్లి గ్రామపంచాయతీ అధికారి

గ్రామస్తులు ఆరోపణ



**పూతలపట్టు, మే 4 ప్రభాతవార్త** పూతలపట్టు మండలం వేనూతనపల్లి గ్రామపంచాయతీ అధికారి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్లు పంచాయతీ ప్రజలు ఆరోపిస్తున్నారు. వి.కొత్తూరు నందు గ్రామపంచాయతీ బోరు మోటారు మూడేళ్ల క్రితం ఏర్పాటుచేశారని, కానీ పంచాయతీ అధికారి ఇటీవల వేసినదని కొత్త మోటర్ పైపులు అమర్చినట్టు తప్పుడు రికార్డులు సృష్టించి పంచాయతీ విధులను కొల్లగొట్టి అక్రమాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేయడం ఏ మాత్రం సమంజసం అని వేనూతనపల్లి గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు దీనిపై క్షేత్రస్థాయిలో సమీక్షించి దుర్వినియోగం అవుతున్న పంచాయతీ నిధులను కాపాడి అవినీతికి పాల్పడ్డ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపండి:

ఎంఎల్ఏ

శ్రీకాళహస్తిరూరల్,మే 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి కోరారు. ఆదివారం ఊరందూరు గ్రామంలోని తన నివాసగృహంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి సమస్యల అర్జిలను తీసుకొని వెనువెంటనే అధికారులతో చర్చించారు. ఆర్థిక పరమైన సమస్యల కాకుండా ఇతర సమస్యలను సత్వరంగా పరిష్కరించాలన్నారు.ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారు. ఎన్నో అంచనాలతో ఉన్నారన్నారు.ముఖ్యంగా ఏ గ్రామంలో చూసినా భూ సమస్యలు చోటు చేసుకున్నాయి. అంతేకాక భూములకు సంబంధించిన అనుభవం ఒకరి చేతిలో కానీ రికార్డులు మరొకరికి ఇచ్చి సమస్యలు సృష్టించి ఉన్నారని ఈ సమస్యలపై వెంటనే అధికారులు స్పందించి పరిష్కరించాలన్నారు. ఏక్కడైనా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తన దృష్టికి వస్తే తానే కార్యాలయాలకు వస్తానన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందించారు.

## సదాశివకోన జమా ఖర్చుల్లో భారీగా అక్రమాలు



**వడమాలపేట, మే 4 ప్రభాతవార్త** సదాశివకోనలో శివరాత్రికి వచ్చిన ఆదాయం, జమా ఖర్చుల్లో భారీగా అక్రమాలు జరిగాయని శివ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వడమాలపేట మండల పరిధిలోనిసదాశివకోనలో శివరాత్రి సందర్భంగా వచ్చిన ఆదాయాన్ని ఎండోమెంట్ వారు ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారని శివ భక్తులు మండి పడ్డారు. తప్పుడు లెక్కలు రాసి సుమారు మూడు లక్షల రూపాయలకుపైగా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. జిల్లాస్థాయి అధికారులు విచారణ చేసి శివుడిసొమ్ము రికవరీ చేయాలని భక్తులు డిమాండ్ చేశారు. శివరాత్రి తరువాత ఆదాయ, వ్యయాలను భక్తుల సమక్షంలో తేల్చాల్సి ఉంది. అయితే రెండు పర్యాయాలు నామమాత్రంగా సమావేశాలు పెట్టిన ఈ ఓ లెక్కలు చూపించారు. అవి తప్పుడు లెక్కలని భక్తులు ఈ విషయాన్ని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి తీసుకెళ్లారు. భక్తులు ఫిర్యాదుతో స్పందించిన ఎమ్మెల్యే జమా ఖర్చులు నిజాయితీగాచూపించాల్సిందిగా ఎండోమెంట్ అధికారులను ఆదేశించారు. దీంతో ఆదివారం వడమాలపేట ఆంజనేయస్వామి ఆలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 27న మహా శివరాత్రి సందర్భంగా 11,87,675 రూపాయలు ఆదాయం వచ్చింది. 11,15,609 రూపాయల మేరకు ఖర్చులు చేసినట్లు ఎండోమెంట్ అధికారులు తేల్చారు. ఖర్చుల వివరాల పై కొన్నేళ్లుగా అవగాహన ఉన్న భక్తులు తప్పుడు లెక్కలని శివుని సొమ్ము వాటాలు వేసుకుని దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకమండ లిసభ్యులు శ్రీధర్‌రాజు, డిల్లీ ప్రసాద్, సురేష్, శంకరయ్య, సదాశివకోన మాజీ చైర్మన్ శేషాద్రి యాదవ్, అన్నదాన సమాజం నాయకులు సత్యనారాయణ, సదాశివం, శంకర్, ప్రసాద్, వితరణ సమాజం నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, మోహన్‌నాయుడు, సుధాకర్‌నాయుడు తదితరులు కోరుతున్నారు.

## డిగ్రీ పరీక్షల సెంటర్ల మార్పుతో విద్యార్థుల అవస్థలు

**తిరుపతి విద్య మే 4 ప్రభాత వార్త**

ఎస్వీయూ అధికారుల తీరుతో డిగ్రీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. నీట్ పరీక్ష నేపథ్యంలో డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో ఆదివారం జరగాల్సిన డిగ్రీ పరీక్షల సెంటర్లు సైతం గతంలో అదే కళాశాలలో జరగనున్నట్లు హాల్టికెట్లలో సమాచారం ఉంది. కానీ ఆదివారం నీట్ పరీక్ష జరగున్న సమయానికి డిగ్రీ పరీక్షలు అదే సెంటర్లో ఉండటంతో అధికారులు పక్కనున్న జూనియర్ కళాశాలలకు సెంటర్లును మార్పు చేశారు. దీంతో విద్యార్థులు పరీక్ష కేంద్రాల విషయంలో ఆదివారం కన్ఫ్యూజన్ కు గురై అయోమయంతో కాస్త కంగారు పడ్డారు. దీంతో అక్కడే విధినిర్వహణలో ఉన్న పోలీసులు విద్యార్థులను సంబంధిత పరీక్షా కేంద్రాలకు తమ వాహనాలలో తరలించారు.

## లెర్నింగ్ సెంటర్ ప్రారంభించిన వేదాంతు




**తిరుపతి విద్య మే 4 ప్రభాత వార్త** తన సొంత ప్రాంతం తిరుపతిలో లెర్నింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా రాబోయే రోజుల్లో ఎక్కువ మంది విద్యార్థులకు అందుబాటులో ఉండాలనే విజన్ తో వేదాంతు లెర్నింగ్ సెంటర్ ప్రారంభించినట్లు ఆ సంస్థ సీఈవో వంశీ కృష్ణ తెలిపారు. తిరుపతి న్యూ మారుతి నగర్ లో నూతన లెర్నింగ్ సెంటర్ ప్రారంభం సందర్భంగా ఆదివారం కచిపి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పూర్తి సామర్థ్యాన్ని బయటకు తీసుకువచ్చేది ఉపాధ్యాయుడే. అలాంటి ఉపాధ్యాయుడు అందించే బోధన అద్భుతంగా ఉండాలని బలంగా నమ్ముతోంది వేదాంతు. అందుకే అదే లక్ష్యంతో అభ్యాస నమూనా అత్యాధునిక సాంకేతికత, డేటాఆధారిత బోధన, వ్యక్తి గతీకరించిన మార్గదర్శకత్వాన్ని మిళితం చేసి, ప్రభావవంతమైన అభ్యాస అనుభవాలను అందిస్తుంది. భారతదేశం అంతటా 100 ఆఫ్‌లైన్ కేంద్రాల వేగంగా విస్తరిస్తున్న నెట్‌వర్క్ తో, జెఈఈ, నీట్, స్టేట్ బోర్డ్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు వ్యక్తిగతీకరించిన విద్య కోసం వేదాంతు కొత్త బెంచ్‌మార్క్ ను నిర్దేశిస్తోందన్నారు. ఈ సరికొత్త లెర్నింగ్ సెంటర్ ప్రారంభం ద్వారా ఇదే పట్టణం తిరుపతిలో జన్మించిన వేదాంతు సహ వ్యవస్థాపకుడు అయినా తనకు ఇది ఎంతో విశిష్టమైనది. స్థానిక తరగతి గదుల నుండి ఐఐటీ బాంబే వరకు, ఆ తర్వాత భారతదేశంలో అత్యంత గౌరవనీయమైన విద్యా సంస్థలలో ఒకదానిని నిర్మించడం వరకు నా ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తి దాయకం. అన్నింటికి మించి విద్య పవర్ ని ఇది తెలియచేస్తుంది. తిరుపతికి తిరిగి రావడంతో నా జీవితం మళ్లీ పూర్తి వృత్తంలోకి వచ్చినట్లు అనిపిస్తుంది అని అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఐసెట్ హాల్ టికెట్లు విడుదల

**తిరుపతి విద్య, మే 4 ప్రభాతవార్త**

ఏంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాలకు కోసం ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐసెట్ 2025 హాల్ టికెట్లను ఆదివారం నుంచి ఆన్లైన్లో విడుదల చేశారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నంబర్, హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీని నమోదు చేసి హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవచ్చునని అధికారులు వెల్లడించారు. ఈనెల 7 వ తేదీన ఐసెట్ 2025 పరీక్ష నిర్వహించనున్నారు.

## శ్రీకాళహస్తిలో ఉచిత సున్తీ

**తొట్టంబేడు, మే 4 ప్రభాతవార్త**



హజరత్ మహబూబ్‌సుబహాని రహ్ నిషాన్ సంఘం సారథ్యంలో ఆదివారం ఉచిత సున్తీ కార్యక్రమాలను ఈదుల గుం ట ఈద్‌గాహ్‌లోని షాదిమహల్‌లో నిర్వహించారు. సంఘం ముతవల్లి షేక్ మీర్జాన్ సాహెబ్ సారథ్యంలో ఏర్పాటు చేసారు. ప్రతి ఏడాది వేసవి కాలంలో సంఘం నిర్వాహకులు మీర్జాన్ సాహెబ్ సారథ్యంలో నిరుపేద ముస్లిం పిల్లలకు ఒడుదులు కార్యక్రమాలు నిర్వహించటం ఆనవాయితీ. ఈనేపథ్యంలో ఆదివారం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు సున్తీ చేయటానికి వెంకటగిరికి చెందిన డాక్టర్ అహమ్మద్‌బాషా హాజరై 26 మంది పిల్లలకు ఒడుగులు చేసారు. ఒడుగులు చేసిన పిల్లలకు పండ్లు, బ్రెడ్, మందులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా మీర్జాన్ సాహెబ్ మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగాఈ సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో యాంటి కరప్షన్ సంఘాధ్యక్షుడు లాలూసాహెబ్, , కార్యదర్శి ఆరీఫ్, యాసిన్, ఖాదర్‌బాషా, ముజీప్ సాధక్, కాలేషా ,సలీం తదితరులు పాల్గొన్నారు. ఎసేవలందించారు.

## ఉద్యోగుల సంక్షేమానికి కృషి



**శ్రీకాళహస్తి, మే 4 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ సర్వసభ్యసమావేశం ఆదివారం సంఘ భవనంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్ సుబ్రమణ్యం అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా నాల్గవ తరగతి ఉద్యోగులకు ప్రభుత్వం కల్పిస్తున్న వెసులుబాట్లను వివరించారు. ఉద్యోగుల సంక్షేమానికి సంఘం నిత్యం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నికలను జి.మునికృష్ణారెడ్డి నిర్వహించారు. జిల్లా కార్యదర్శి యం.శ్రీనివాసులు పర్యవేక్షకులుగా వచ్చారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షులుగా కమర్షియల్ టాక్సు కు చెందిన కె.రవిచంద్రారెడ్డి అధ్యక్షులుగా కె.పెంచుల్‌రెడ్డి(పంచాయతీరాజ్) కార్యదర్శిగా పి.రాజేంద్ర(ఇరిగేషన్), కోశాదికారిగా కె.హరిబాబు(ఇరిగేషన్), ఉపాధ్యక్షులుగా బి.వెంకటలక్ష్మీ, (ఇరిగిగేషన్) ఏ.శరవన్ కుమార్ (మున్సి పాలిటి సహాయకార్యదర్శిగా పి.రాజేష్‌బాబు(ఇరిగేషన్) కార్యనిర్వాహక సభ్యుడుగా కె.రాధిక(మునన్సి పాలిటి), టోని ఎడ్విన్(కమర్షియల్ టాక్సు)లను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు మునికృష్ణారెడ్డి తెలిపారు

## నిరంతరం సేవలందించటం పూర్వ జన్మసుకృతం



**ఎంఎల్ఏచే రూ.లక్ష విరాళం**

**శ్రీకాళహస్తి, మే 4 ప్రభాతవార్త** సేవా గుణం అందరికి అలవడదు. నిరంతరం సేవలందించటం పూర్వ జన్మసుకృతం. శ్రీకాళహస్తిలో దివ్యాంగులకు 160 నెలలుగా నెల నెల నిత్యావసర సరకులను అందిస్తున్న షేక్‌మునీర్‌బాషా జన్మధన్యమని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హెల్పింగ్ హ్యాండ్స్ అధినేత మునీర్‌బాషా ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, ఆయన మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, సతీమణి బొజ్జల రిషితారెడ్డిలు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాలను ఎవరు నిర్వహించినా తాను అండగా ఉంటానన్నారు. ఇలాంటి వారి సేవలతోనే ఇంకా సమాజంలో నిజాయితి మిగిలి ఉందన్నారు. తాను మునిర్‌బాషా దివ్యాంగులకు అందిస్తున్న సేవల గురించి వింటున్నానని నేడు ప్రత్యక్షంగా చూస్తున్నానని వివరించారు. నియోజకవర్గంలోని పరిశ్రమలతో మాట్లాడి సిఎస్ఆర్ ఫండ్ ద్వారా ఈ సంస్థ అభివృద్దికి కృషి చేస్తామని ప్రకటించారు. సంస్థకు తన వంతుగా ఉడతాభక్తిగా లక్ష రూపాయలను విరాళాన్ని అందజేస్తున్నారని తెలియజేసారు. తన నియోజకవర్గంలో మునీర్‌బాషా లాంటి సేవకులు ఎంతో మంది ఉన్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు, మార్కెటింగ్ కమిటి మాజీ అధ్యక్షుడు చెంచయ్యానాయుడు, ఉమేష్‌రావు, నెమళ్ళ సుబ్రమణ్యం, గరికపాటి రమేష్, బాబాఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

## మోటార్‌సైకిళ్ళకు సర్వీసు

**శ్రీకాళహస్తి, మే 4 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తిపట్టణంలోని కొత్తపేట జిల్లా పరిషత్ బాలికోన్నతపాఠశాల ఎదురుగా ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌బంకు వద్ద సోమవారం నుంచి మోటార్ సైకిళ్ళకు ఉచిత సర్వీసు అందించబడుతుందని నిర్వాహాకులు వివరించారు. 1967 నుంచి నిర్వహించబడుతున్న వియస్ వెంకటముని పెట్రోల్‌బంకు వద్ద 90రోజుల పాటు ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో తిరుపతి ఇండియన్ ఆయిల్ డివిజినల్ ఆఫీస్ డిఆర్‌హెచ్ జయంత్‌కుమార్ బృందంచే పోట్రోల్ వాహనాదారులకు ఇంజన్ అయిల్ కొనుగోలు చేసిన వినియోగదారునికి ఫ్రీ సర్వీస్ అందిస్తూ సర్వీస్‌చేయించుకున్న వారికి అదనంగా రూ.50ల పెట్రోల్ ఉచితంగా అందించబడుతుందని వివరించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఈ సదుపాయం కల్పించబడుతుందని మేనేజ్‌మెంట్ వివరించారు.

## కానిస్టేబుళ్ళకు ఘనంగా వీడ్కోలు

**విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించండి..! సిఐ సిబ్బరామిరెడ్డి**



**చంద్రగిరి, మే 4 ప్రభాతవార్త:** చంద్రగిరిలో సుధీర్ఘ కాలం పాటు విధులు నిర్వహించిన కానిస్టేబుళ్ళకు బదిలీ ఉత్తర్వులు అందడంతో ఆదివారం సిఐ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఐ మాట్లాడుతూ విధినిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తే తప్పక రాణించగలరని అన్నారు. అదేవిధంగా జవాబుదారీ తనాన్ని అలవరుచుకోవాలన్నారు. విధి నిర్వహణలో తనకు ప్రతి ఒక్కరి సహకారం లభించినట్లు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బదిలీ అయిన హెడ్ కానిస్టేబుల్స్ ఎం.పురుషోత్తం నాయుడు, పి.జయచంద్ర నాయుడు, కానిస్టేబుల్స్ జి.దేవేంద్ర, బి.సుబ్రమణ్యం, దివాకర్ రావు, వెంకటరెడ్డిలను ఘన ంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనిత, ఏఎస్ఐలు అమ్జాద్ భాషా, సుధాకర్, డబ్ల్యు ఏఎస్ఐ నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

## అట్టహాసంగా "హీరా" వార్షికోత్సవ సంబరాలు

**పాతిక సంవత్సరాల విద్యాదాన ప్రయాణం**





**చంద్రగిరి, మే4ప్రభాత వార్త:** తొండవాడలోని హీరా ఉర్ధూ పాఠశాల 26 వార్షికోత్సవ సంబరాలు ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ముస్లీమ్ కుటుంబాల లోని నిరుపేద బాలికలకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలనే సత్సంకల్పంతో హీరా చైర్మన్ నౌహీరా షేక్ పాతికేళ్ళక్రితం సాధారణ స్థితిలో ఉర్ధూ పాఠశాలను స్థాపించారు. పాతిక సంవత్సరాల విద్యాదాన ప్రయాణంలో నౌహీరా షేక్ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ వాటిని అధిగమిస్తూ అంచెలంచెలుగా పాఠశాలను అభివృద్ధి చేశారు. వేలాది మంది విద్యార్థినుల జీవితాలలో వెలుగులు నింపుతున్న హీరా పాఠశాల నేడు కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా తమ బాలికలకు ఉచిత విద్యను అందిస్తూ సర్వత్రా ప్రశంసలు అందుకుంటూ ముందుకు సాగుతున్నది. ప్రస్తుతం 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు 400 మంది విద్యార్థినులు హీరా నందు విద్యాభ్యాసం చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ ముబారక్ జాన్ వెల్లడించారు. విద్యార్థినులకు విద్య, ఉచిత భోజన వసతి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు హీరా అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. వార్షికోత్సవ సంబరాలను పురస్కరించుకుని విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. అనంతరం విద్యార్థినులకు సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు.

## డిల్లీబాబుకు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



**విజయపురం, మే 4 ప్రభాతవార్త:** విజయపురం మండలం బొగ్గుల వారి కండ్రిగకు చెందిన ఎస్.డిల్లీ బాబుకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.97,758ల చెక్కును నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అందజేశారు. కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## తనపల్లి స్మశానవాటికలో శివుని విగ్రహం ప్రతిష్ట



**తిరుపతిరూరల్, మే 4 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండలం తనపల్లి స్మశానవాటికలో ఆదివారం పరమ శివుని విగ్రహాన్ని ప్రతిష్టించారు. తనపల్లి టిడిపి అధ్యక్షుడు బాలచంద్రారెడ్డి తన తల్లిదండ్రులు గురవారెడ్డి, మునెమ్మగార్ల జ్ఞాపకార్థంగా స్మశానవాటికలో శివుడు విగ్రహాన్ని ప్రతిష్టించినట్లు తెలిపారు. ఈసందర్భంగా బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ తనపల్లి స్మశానవాటిక సుందరీకరణతో పాటు శివుని విగ్రహాన్ని కూడా ప్రతిష్టిస్తే బావుంటుందని భావించి, స్వంత నిధులు రూ.2లక్షల రుపాయాలు వెచ్చించి శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బయన్నగారి విజయసింహారెడ్డి, ధనలక్ష్మీ, శశికళ, పెద్దఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

## కంచి పీఠం స్వాములకు స్వాగతం పలికిన

**పుత్తూరు రూరల్, మే 4 ప్రభాతవార్త:** ఇటీవల కంచి కామకోటి పీఠం ఉత్తరాధికారిగా పట్టాభిషిక్తులైన



శ్రీశ్రీశ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామిజీ వారు గురువుగారైన శ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి వారితో కలసి మొట్ట మొదటిగా శ్రీవారి దర్శనార్థం తిరుపతికి శనివారం విచ్చేశారు. ఈ సందర్భంగా పుత్తూరు శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సంఘం వారు తిరుపతి-చెన్నై జాతీయ రహదారి మైవేలోని(మలేషియా మురుగన్) శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద పూర్ణకుంభతో ఘన స్వాగతం పలికారు. దైవభక్తి సంస్కృతి సంప్రదాయాలు, కాపాడుతున్నటువంటి కంచిపీఠం ఎందరు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచిందని ఈ సందర్భంగా స్వాముల వారు మొట్ట మొదటి సారిగా మా పుత్తూరు ప్రాంతానికి రావడం ఇటు నుంచి తిరుపతికి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకోవడానికి వెళుతూ మాకు అనుగ్రహ దర్శనం కల్పించడం చాలా ఆనంద దాయకమని పుత్తూరు పట్టణంలోని ప్రజలు, బ్రాహ్మణ సంఘం భక్తులు ఆ సంఘ గౌరవాధ్యక్షులు ఆలూరి రామకృష్ణ తెలియజేశారు. స్వామివారు పుత్తూరు బ్రాహ్మణ సంఘం వారి ఆశీర్వదించారు. కార్యక్రమంలో పుత్తూరు గాయత్రీ బ్రాహ్మణ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## హలో యువత ఛలో తిరుపతి

**పుత్తూరు రూరల్, మే 4 ప్రభాతవార్త:** తిరుపతి నగరంలో జరగబోయే 17వ ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వద్ద వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. యువతి, యువకులు తరలివచ్చి తిరుపతిలో జరగబోయే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు మహేష్ పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్)జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన జాతీయ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను పుత్తూరు మండల అధ్యక్షుడు దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో విడుదలచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 15 నుంచి 18 తేదీ వరకు చారిత్రాత్మక నగరమైన తిరుపతిలో మొట్ట మొదటిసారిగా అఖిల భారత యువజన సమాఖ్య జాతీయ మహాసభలు జరగబోతున్నాయన్నారు. 29 రాష్ట్రాల నుంచి యువజన సమాఖ్య ప్రతినిధులు వస్తున్నారని, వేలాది మంది యువతి, యువకులు తిరుపతి నగరంలో జరిగే భారీ ర్యాలీలో కదం తొక్కబోతున్నారని, సుమారు వెయ్యి మంది ప్రతినిధులతో సభ మూడు రోజుల పాటు ఈ మహాసభలు జరుగుతాయన్నారు. నిరుద్యోగ, అశాంతి, ప్రాంతీయ, మతతత్వ విధానాలు ఉపాధి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. పుత్తూరు డివిజన్ పరిధిలో విద్యార్థులు, యువకులు ఈ మహాసభల్లో పాల్గొని జయప్రదంచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు భార్గవ్, వినోద్, పొన్నుస్వామి, మనోజ్, ప్రదీప్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన సెల్వ వినాయకస్వామి మహా కుంభాభిషేకం

**పుత్తూరు రూరల్, మే 4 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణం లోని పిల్లాడుగుడి వీధి, తేరు దగ్గర(బజారు వీధి)లో



వెలసిన సెల్వ వినాయకస్వామి మహా కుంభాభిషేకం ఆదివారంతో ముగిసింది. ఈ మహా కుంభాభిషేకం శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఆలయ ఆవరణలోనిర్వహించారు. ఆదివారం ఉదయం 4వ కాల యాగశాల పూజ తత్వార్చన కళాకర్షణం జీవాకర్షణం మూలమంత్ర హోమాలు అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం, సాయంత్రం మంగళ వాయిద్యాల నడుమ విద్యుత్ దీపాలంకరణతో ప్రత్యేక పుష్పాలతో అలంకరించి శ్రీ సెల్వ వినాయక స్వామి, శ్రీ సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామివారికి, అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## శేష వాహనంపై శ్రీ సదాశివేశ్వరుడు

**పుత్తూరు రూరల్, మే 4 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని కార్వేటినగరంరోడ్డులో వెలసిన శ్రీ కామాక్షి



సమేత సదాశి వేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్వామివారు, అమ్మవారు శేష వాహనంపై ఊరేగించారు. ఉద యం ఆలయంలోని మూల ఉత్సవ విగ్రహాలకు అభిషే కాలు, అలంకరణలు చేశారు. అలాగే స్వామి, అమ్మవార్లను ఆలయ చుట్టూ ప్రదక్షిణంనిర్వహించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## గురువులే మార్గదర్శకులు

**వడమాలపేట, మే 4 ప్రభాతవార్త:**

వడమాలపేట ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ ఘనంగా జరుపుకుని వారి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రాంగణంలోచెట్లు నాటే కార్యక్రమం నిర్వహించి ప్రతి ఒక్కరికిచెట్లను పంపిణీ చేయడం జరిగింది. ఇందులో ఉపాధ్యాయులు, విద్యార్థులందరూ ఆనందంగా గడిపారు.

# తిరుపతి డివిజన్

## ఘనంగా కొల్లాపురమ్మ అమ్మవారి జాతర



**నారాయణవనం, మే 4 ప్రభాతవార్త** మండలంలోని కశింమిట్ట పంచాయతీ కశింమిట్ట యానాధికాలనీ, బొబ్బరాజుపాలెం పంచాయతీ లక్ష్మీపురంయానాధికాలనీలో ఆదివారం ఘనంగా కొల్లాపురమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్‌దీపాలంకరణ, పచ్చనితోరణాలు, మామిడిఆకులు, వేపాకుతో అలంకరించారు. ఉదయం మహిళా భక్తులు అమ్మవారికి అంబళ్లు పోసి మొక్కుతీర్చుకున్నారు. మొకు ్కబడి కలిగిన భక్తులు అమ్మవారి ఆలయం ఎదుట జంతుబలి సమర్పించారు. రాత్రి అమ్మవారిని ట్రాక్టర్‌పై అదిరోహించి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భాణసంచా వేడుకల నడుమ ఘనంగా ఊరేగించారు. భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు.

## భీమునిచెరువులో మహిళా భక్తుల జాతర పొంగళ్లు

**నారాయణవనం, మే 4 ప్రభాతవార్త :**



మండలంలోని భీమునిచెరువు, కశింమిట్ట గ్రామాలకు చెందిన మహిళా భక్తులు మంగళవారం సాయంత్రం పొంగళ్లు పెట్టారు. మే రేపటి నుంచి మూడురోజుల పాటు జరగనున్న గంగజాతర వేడుకలకు సంబందించి మంగళవారం రాత్రి చాటింపు నిర్వహించారు. చాటింపుకు ముందు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం సుమారు 200మంది మహిళా భక్తులు పడవేటమ్మకు పొంగళ్లు పెట్టారు. మొక్కుబడి కలిగిన భక్తులు జంతు బలి ఇచ్చుకున్నారు. అలాగే ఉదయం అమ్మవారి ఆలయం ఎదుట అంబళ్లు పోశారు.

## 11న పరాశరేశ్వరుని ఆలయంలో గురు పయర్చి పూజలు

**నారాయణవనం, మే 4 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 11వ తేది ఆదివారం గురు దక్షణమూర్తికి గురు పయర్చి పరిహార పూజలు నిర్వహించడం జరుగుతుందని అర్చకులు రమణి గురుకుల్ తెలిపారు. ఈనెల 11న గురువు వృషభ రాశి నుంచి మిధున రాశిలోకి ప్రవేశిస్తున్న తరుణంలో సాయంత్రం 5గంటలకు మేష రాశి, మిధున, కర్కాటక, కన్యా, వృశ్చిక, మకరరాశుల వారు పరిహారం చేసుకోవాలన్నారు.

## అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సిఐ విస్తృత పర్యటన



**రేణిగుంట మే 4 ప్రభాతవార్త** ఎణిగుంట మండలం అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో, అనేక ప్రాంతాల్లో ఆదివారం నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన అర్బన్ సీఐ జయచంద్ర ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డిఎస్పి శ్రీనివాసరావు సూచనలను అనుసరించి తమ సిబ్బందితో విస్తృతంగా పర్యటించి ప్రజలతో మమేకమై అవగాహన కల్పించారు. మండలంలోని దొడ్లమిట్ట, కరకంబాడి, బీసీ కాలనీ, తదితర గ్రామాల్లో ప్రజలు, పిల్లలు, విద్యార్థులు నేషనల్ హైవే పక్కన ఉన్న దాబాల్లో నిర్వహకులు, పనిచేస్తున్న కార్మికులతో అవగాహన సదస్సులను నిర్వహించారు. భద్రతకు సంబంధించి అనేక విషయాలను వారికి వివరించారు. సైబర్ నేరాల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. యువత, విద్యార్థులు, చిన్నపిల్లలు మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా బెట్టింగ్ యాప్ లకు దూరంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలు సేవించినా, అమ్మినా, అక్రమ రవాణాకు పాల్పడినా, ప్రోత్సహించినా చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రస్తుతం భారతదేశ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా ఎవరైనా కొత్తవారు కనిపించినా, ఆగంతకులు సంచరించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సాయంత్రం అర్బన్ స్టేషన్ వద్దకు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. రేణిగుంట పట్టణమంతా తిరిగి ట్రాఫిక్కు కలుగుతున్న అవరోధాలను పరిశీలించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించడానికి తీసుకోవాల్సిన చర్యల పట్ల ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

## కేవీబీ పురం మండలంలో గాలి, వాన బీభత్సం

**గాలివానకు విద్యుత్ సరఫరా కట్**



**కేవీబీ పురం, మే 4 ప్రభాతవార్త:** మండల కేంద్రం కేవీబీ పురంలో భారీ వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా అంతరాయం కలిగింది. ఆదివారం సాయంత్రం కేవీబీ పురంలో సుమారు 40 నిమిషాలు గాలి, వాన కురవడంతో విద్యుత్ వైర్లు తెగిపోయి సరఫరాకు అంతరాయం కలిగింది. మామిడి కాయలు గాలికి రాలిపోయినట్లు రైతులు వాపోతున్నారు. గత మూడు నెలలుగా వేసవితాపానికి మండల కేంద్రం ప్రజలు అల్లాడిపోయారని, ఒక పదును వర్షం పడి చల్లదనం ఇచ్చిందని వాహన దారులు, గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాయిపేడు, సదాశివపురం, ఆరె, మిద్దికండ్రిగ, పిచ్చాటూరు వరకు భారీ వర్షం కురిసినట్లు తెలిపారు.

## అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా



**సత్యవేడు, మే 4 ప్రభాతవార్త:** మండల పరిధిలో అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా కొట్టిన సంఘటన ఆదివారం సత్యవేడు మండలం రాజుగుంట గ్రామం చెరువు మలుపు వద్ద చోటు చేసుకుంది. నాగలాపురం నుంచి ఇసుక ట్రాక్టర్‌తో తీసుకు వెళుతుండగా ఉదయం రాజుగుంట గ్రామం చెరువు సమీపం ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టడం జరిగిందని, ఆ మార్గంలోవెళ్లే వాహనదారులు వాపోయారు. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ట్రాక్టర్ బోల్తా కొట్టిందా...లేక అతివేగమా.... లేకుంటే రోడ్డు సరిలేని కారణంగా ఈ ప్రమాదం చోటు చేసుకుందా అన్నది తెలియడం లేదు. ఇకనైనా ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు మేలుకుని ఈ మార్గంలో రోడ్డు మరమ్మతు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు, ప్రయాణికులు వాపోతున్నారు.

## 7న మంత్రి లోకేష్ సత్యవేడుకు రాక

**సత్యవేడు, మే 4 ప్రభాతవార్త:**



సత్యవేడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత, ఫ్యాలెస్‌లకు పరిమితం కాకుండా కార్యకర్తలకు అండగా ఎల్లప్పుడు తోడుగా ఉంటామని 'యువగళం' పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం ఈ నెల 7న సత్యవేడు నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడుకు రానున్నారు. సత్యవేడు నియోజకవర్గంపై వస్తున్న రాజకీయ ఆరోపణలు, ఇన్‌చార్జిని నియమించాలని పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి వస్తున్న అభ్యర్థనలను, విశ్లేషించి ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్తతో ముఖాముఖి భేటితో అభిప్రాయ సేకరణ కూడా మంత్రి లోకేష్ చేపట్టనున్నట్లు, విశ్వసనీయ సమాచారం. ఏదీ ఏమైనా సత్యవేడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతం చేస్తూ కార్యకర్తలసంక్షేమం దిశగా లోకేష్ అడుగువేయనున్నట్లు స్థానిక కేడర్ చర్చించుకుంటున్నారు. కాగా మంత్రి లోకేష్ పర్యటన సందర్భంగా సమావేశ సభ, కార్యక్రమ ప్రణాళికకు అనుగుణంగా ఇక్కడ ఏర్పాట్లను షాప్ చైర్మన్ రవినాయుడు, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు, పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు పరిశీలిస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సతీష్‌నాయుడు, మునస్వామి యాదవ్, నరేంద్ర, శివ కుమార్ నాయుడు, బాషా, గిరిబాబు, ఈశ్వర్, పృథ్వీ, దిలీప్, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

## మీ సహకారానికి ధన్యవాదాలు

**ఎంఎల్ఏ అమర్‌నాద్ రెడ్డితో పల్లినేని**

**చంద్రగిరి, మే 4 ప్రభాతవార్త:**



రాజకీయంగా మీరు అందిస్తున్న సహకారానికి ప్రత్యేక ధన్యవాదాలని పలమనేరు ఎంఎల్ఏ అమర్‌నాద్ రెడ్డికి డిసిఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు అన్నారు. డిసిఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన పల్లినేని ఆదివారం ఎంఎల్ఏ పులివర్తి నానితో కలసి పలమనేరులోని ఎంఎల్ఏ నివాసంలో అమర్‌నాద్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి డిసిఎంఎస్ చైర్మన్‌గా సమర్ధవంతమైన సేవలను అందించడంలో మా నాయకుడు పులివర్తి నానితో పాటు మీ దిశానిర్దేశం తప్పసరి అని అన్నారు. చంద్రగిరి నియోజకవర్గంతో ప్రత్యేక అనుబంధం కలిగిన ఆయన ఎంఎల్ఏ పాటు పల్లినేని సహ మండలం నుండి ఆయనను కలిసేందుకు విచ్చేసిన టిడిపి నాయకులను పేరుపేరునా ఆత్మీయంగా పలకరించారు. ఈ క్రమంలో పలు అంశాలపై చర్చించుకుని, కూటమి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో పరస్పర సహకారంతో సమర్ధవంతంగా పనిచేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గౌస్‌భాషా, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, తుడా మాజీ డైరెక్టర్ ఏజి పల్లి బాల, తెలుగుయువత మండల అధ్యక్షుడు రాజులగారి వినోద్ కుమార్ రెడ్డి, నాయకులు సక్కుర్ ధనంజయ రెడ్డి, గాలి సతీష్, చెంచయ్య, రమేష్, లోకాద్రి నాయుడు, మేడసాని కుమార్, లోక, తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షంతో రైతులకు తీరని నష్టం

**- వర్షంతో ధ్వంస మైన ఇటుక బట్టీలు..**
**- మామిడి తోటలో రాలిపోయిన పిందెలు, కాయలు**

వాకాడు, మే 4 ప్రభాతవార్త : వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో మెరుపులతో కూడి నఅకాల భారీ వర్షం రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. ఎండలతో భగ్గు మంటున్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోయి భారీ శబ్దాలతో ఉరుములు, మెరుపులతో, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో రైతులకు మామిడి తోటల్లో కాయలు రాలిపోయి, మిర్చి తోటలో కూడా తీవ్ర నష్టాన్ని గురిచేసాయి. ఈ అకాల వర్షంతో ఇటుక బట్టీలు నిర్వహణతో పాటు చిరు వ్యాపారం సైతం తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఊహించిన విధంగా రెండు గంటల పాటు పడిన అకాల వర్షానికి పౌర జీవనం అస్తవ్యస్తంగా మారింది. పలుచోట్ల విద్యుత్ అంతరాయం కలిగింది, కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు నేల ఒరిగాయి, రోడ్డుకు ఇరువైపులా చెట్లు విరిగిపడిపోయాయి.

## వడగాలులు.. భారీ వర్షం




కోట, మే 4 ప్రభాతవార్త : ఆక్వా సాగుకు అడుగడుగునా అవాంతరాలు ఎదురవు తున్నాయి. ఏ ముహూర్తాన సుంకాలు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేశారో అప్పటి నుంచి వరుస సమస్యలతో రైతులు సతమతం అవుతు న్నారు. సుంకాలు నిలుపుదల నిర్ణయం వెలువడినా నేటికీ పరిస్థితి కుదుట పడలేదు. అంతా సర్దుకుంటుంది అనుకున్న ప్రతిసారి వాతావరణం కలవర పెడుతుంది. నెలరోజులు వ్యవధిలో మరోసారి ఆకాశంలో ఆకస్మిక మార్పులు చోటుచేసుకోవడంతో పంటను కాపాడు కోవడానికి అవస్థలు పడుతున్నారు. నాలుగురోజులు నుంచి పూటకోరకంగా వాతావరణం మారుతోంది. కాసేపు వడగాల్పులతో భానుడు భగభగమండుతుంటే అంతలోనే వరుణుడు ఆకాశాన్ని కమ్మేస్తున్నాడు. చిరుజల్లులు చిలకరిస్తున్నాడు. కాసేపటికే ఎండ భగ్గుమంటుంది. ఒక్కోసారి ఎండ కాస్తుండగానే చినుకులు పడుతుండటంతో రైతులు కలవర పడుతున్నారు. వాతావరణంలో ఆకస్మిక మార్పులు జరిగినప్పుడు సహజంగానే చేపలు, రొయ్యలకు ప్రాణవాయువు సక్రమంగా అందదు. ఆక్వా సాగులో ఇది చాలా ప్రమాదకరమైన సమస్య. సామూహికంగా మృత్యువాత పడే అవకాశం ఉంటుంది. ఇలాంటి పరిస్థితులు వలన గతంలో నష్టాలు చవిచూసిన అనుభవాలు కళ్ల ముందు కదలాడుతుండటంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

## కోటలో ఉరుములు మెరుపులతో వర్షం

కోట, మే 4 ప్రభాతవార్త : మండలంలో ఆదివారం మధ్యాహ్నం అర్ధగంట పాటు అల్లకల్లోలంగా మారింది. భారీ వర్షం, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. పలు గ్రామాల్లో ఈదురు గాలులకు చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురవడంతో గంట పాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. కోట, విద్యానగర్ ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీటి ప్రవాహంతో డ్రైనేజీ నీరు కలిసి దుర్గంధభరితంగా మారింది. ఊనుగుంటపాలెం, చిట్టేడు తదితర గ్రామాల్లో మామిడి కాయలు రాలిపోవడంతో మామిడిరైతులు లబోదిబోమంటున్నారు.

## ఉరుములు మెరుపులతో వర్షం : వేసవి పంటలకు నష్టం

తడ, మే 4 ప్రభాతవార్త : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కురిసిన వర్షం వలన వేసవి పంటలు వేసుకున్న రైతులకు నష్టం కలిగింది. ఈదురు గాలులతో ఈ వర్షం కొత భయపెట్టింది. పుచ్చ దోస ఇతర కూరగాయల పంటలు వేసుకున్న రైతులు వర్షం ఇంకా పెరిగి ఉంటే మరింత దెబ్బతినేవారమని చెప్పారు. అయితే వర్షం వలన పుచ్చ, దోస పంటలకు మాత్రం నష్టం తప్పేలా లేదు. సాయంత్రం కురిసిన వర్షపు జల్లులకు ఆ తర్వాత మళ్లీ ఆకాశం మేఘావృతం కావడంతో భయపడుతున్నారు. ఇదిలావుంటే ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా ఎండ ప్రభావం అధికంగా కనిపించింది. ఎండ అలా వెళ్లగానే వర్షం కురవడం వాతావరణంలో కొంత మార్పు తెచ్చింది.

## సూళ్లూరుపేటలో 463వ నేత్రదానం



సూళ్లూరుపేట, మే 4 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు ఆదివారం 463వ నేత్రదానం అందింది. గమండ్లవీధికి చెందిన నాపా మునుస్వామి మృతిచెందడంతో కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాల నుంచి కార్నియాలు సేకరించారు. సేకరించిన కార్నియాలను చెన్నై శంకర్ నేత్రాలయకు పంపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావుకు ఘన సన్మానం



వెంకటగిరి, మే 4 ప్రభాతవార్త : డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎన్నికైన గొంగోడు నాగేశ్వరరావును తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. పట్టణంకు చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ పెంచల కోన దేవస్థానం చైర్మన్ గంగోడు నాగేశ్వర రావు నెల్లూరు జిల్లా డిసియంఎస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకటగిరి మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమోళి రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆయన నివాసంలో టీడీపీ రూరల్ నాయకులు, యూనిట్ ఇంచార్జిలు, బూత్ కన్వీనర్లు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని గజమాలతో ఆయన్ని సన్మానించారు.

ఈ సందర్భంగా పప్పు చంద్రమోళి రెడ్డి మాట్లాడుతూ జి.ఎన్.ఆర్ సోషల్ ట్రస్ట్ తరపున వెంకటగిరి నియోజకవర్గంలో అంబులెన్సు, పేదలకు విద్య, వైద్యం వినూత్న సేవలతో పాటుగా, క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న గంగోటి నాగేశ్వరావు సేవలు అభినందని యమన్నారు. టీడీపీ పార్టీ సీనియర్ నాయకులుగా పార్టీ విజయానికి ఎప్పుడు అండగా ఉండగా ఉంటారని తెలిపారు. అలాగే భవిష్యత్లో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రూరల్ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# మే మాసంలో జాతరలే.. జాతరలు

**- తిరుపతి,చిత్తూరు, పలమనేరు, కుప్పంలో పెద్ద ఎత్తున నిర్వహణ**



కుప్పం, మే 4 ప్రభాతవార్త : మే మాసం వచ్చిదంటే ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో జాతరలు పెద్ద ఎత్తున జరుగుతాయి. పెద్ద నగరాలు, పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోను శ్రీ గంగమ్మ అమ్మవారి జాతరలను ఏటా ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఉమ్మడి జిలా ్లలో జాతర్ల సందడి మొదలైంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జరిగే జాతరలను ఓ సారి పరిశీలిస్తే తొలుత తిరుపతి నగర ంలో వెలసిన శ్రీ తాతయ్య గుంట గ ంగమ్మ జాతరను భారీ ఎత్తున నిర్వహిస్తారు. తిరుపతి గంగ జాతర ఈనెల 6వతేది నుంచి మొదలై 13వతేది వరకు జరుగుతుంది. 13వతేది అమ్మవారి విశ్వరూప దర్శనంతో జాతర ముగియనుంది. తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతరకు నిర్వహించి తాజాగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తిరుపతి జిల్లాలోని ఎమ్మెల్యేలు, పలువురు ప్రముఖులతో కమిటీని ఏర్పాటుచేశారు. వారం రోజుల పాటు జరిగే తాతయ్య గుంట గంగమ్మ జాతరలో భక్తుల వేషాలు ఎంతో ఆకట్టుకుంటాయి. జాతర చివరి రోజు అమ్మవారి దర్శనం అనంతరం అమ్మవారి చెంప మట్టి కోసం భక్తులు భారీ ఎత్తున పోటీలు పడతారు. ఈమట్టిని తమ ఇళ్లల్లో పెట్టుకుంటే మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. జిల్లాలో జరిగే గంగజాతరల సందర్భంగా అమ్మవారికి భారీగా ఆదాయం వచ్చే ఆలయాల్లో ఈ ఆలయం కూడా ఒకటి. ఇక చిత్తూరు నగరంలో వెలసిన శ్రీ నడివీధి గంగమ్మ జాతర మే 13,14 తేదీల్లో జరుగుతుంది. 13న అమ్మవారి శిరస్సు ఊరేగింపు, 14న భక్తులకు దర్శనం ఉంటుంది. చిత్తూరు గంగజాతరను వంశపారంపర్య ధర్మకర్తలు అయిన మాజీ ఎమ్మెల్యే సికె బాబు కుటుంబీకుల అధ్వర ్యంలో నిర్వహిస్తారు. ఇక పలమనేరులో వెలసిన శ్రీ గంగమ్మ జాతర ఈనెల 14-16 తేదీల్లో జరగనుంది. ఈనెల 14న అమ్మవారి శిరస్సు ఊరేగింపు, 15న అమ్మవారి దర్శనం, 16న అమ్మవారి జలాధివాసం కార్యక్రమాలతో పలమనేరులో జాతర ముగుస్తుంది. ఈ జాతర నిర్వహణకు ప్రభుత్వం కమిటీని నియమించింది. ఇక జిల్లాలో మరో ప్రముఖంగా జరిగే జాతర కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ జాతర. ఈసారి శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారి జాతర ఈనెల 20,21 తేదీల్లో జరగనుంది. ఈనెల 6వతేది జాతర చాటింపు వేస్తారు. 20న అమ్మవారి శిరస్సు ఊరేగింపు,21న అమ్మవారి విశ్వరూప దర్శనంతో జాతర ముగుస్తుంది. ఈ జాతర నిర్వహణకు ప్రభుత్వం జాతర నిర్వహణ కమిటీని నియమించింది. కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మకు సైతం జాతర సందర్భంగా భక్తులచే భారీ ఆదాయం వస్తుంది. కాగా ఉమ్మడి జిల్లాలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న జాతరలకు మన రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, తమిళనాడుతో పాటు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడం విశేషంగా చెప్పుకోవాలి. పుంగనూరులో వెలసిన శ్రీ సుగుటూరు గంగమ్మ జాతర ఏప్రిల్‌లో నెలలో ముగిసింది. ఇలా జిల్లాలో ప్రముఖ నగరాలు, పట్టణాల్లో జరిగే జాతరలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం గంగజాతరలు మే నెలలో జోరుగా నిర్వహించడంతో ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొంటోంది.

## కీలపట్లలో శాశ్వత విద్యుత్ సమస్య పరిష్కారం : ఎమ్మెల్యే



గంగవరం, మే 4 ప్రభాతవార్త : మండలంలోని కీలపట్ల పంచాయతీలో విద్యుత్ సమ స్యను శాశ్వతంగా పరిష్క రిస్తున్నట్లు ఎమ్మెల్యే అమర నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆది వారం పంచాయతీ కేంద్రంలో 60లక్షల ఆర్ ్డ ఎస్ నిధులతో ఏర్పాటుచేసిన నాలుగు 100 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కీలపట్ల గ్రామంలో స్వామివారి ఉత్సవాల సందర్భంగా జరిగే విగ్రహాల ఊరేగింపుకు విద్యుత్ తీగల కారణంగా సమస్య ఉండేదన్నారు. గ్రామస్తులు, భక్తుల సౌకర్యార్థం నాలుగు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు అదనంగా 25కెవి ట్రాన్స్‌ఫార్మర్ సైతం ఏర్పాటుచేశామన్నారు. దీంతో నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు లో ఓల్టేజ్ సమస్య తలెత్తదన్నారు. అతి తక్కువ సమయంలో కాంట్రాక్టర్లు, విద్యుత్ శాఖ అధికారులు పనులు పూర్తి చేయడం పట్ల అభినందించారు. కీలపట్ల ఆలయంను టిటిడి పరిధిలో తేవడం, గ్రామంలో రోడ్లు, గృహాలు, విద్యుత్, తాగునీటి వసతి, పాఠశాలల అభివృద్ధి తెదేపా ప్రభుత్వ హయాంలో జరిగాయన్నారు. అంతకుముందు ఆయన శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఇఇ శ్రీనివాసమూర్తి, ఎడి చిన్నబ్బ, నిర్మాణ ఎడి రెడ్డికుమార్, ఎఇ రామకృష్ణ, దేశం నేతలు సోమశేఖర్ గౌడ్, ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్, వేణు, గిరిధర్, గోపాల్, రాము, శీనప్ప, శ్రీనివాసులు, జనసేన నేత చంద్ర పాల్గొన్నారు.

## యోగాలో జాతీయ స్థాయి అవార్డు సాధనే లక్ష్యం

**- తిరుమల ఆలయం ముందు కాకినాడ చిన్నారి యోగాసనాలు**



తిరుమల, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి : జాతీయ స్థాయిలో అవార్డు సాధించాలనేది తన లక్ష్యమని కాకినాడకు చెందిన రేఖాడు చైత్ర వాసుకి పేర్కొంది. ఆదివారం తిరుమలలో శ్రీవారి దర్శనం అనంతరం ఆమె ఆలయం ముందర యోగాసనాలు వేసి ఆకట్టుకుంది. ఈసందర్భంగా వాసుకి మాట్లాడుతూ తాను జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రాణించాలని అందుకు స్వామివారి ఆశీస్సులు కోరినట్లు తెలిపింది. ఇదివరకే తాను 300కుపైగా యోగాసనాల్లో శిక్షణ పొందానని, ఎన్నో యోగా కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు చెప్పింది. తమ పాఠశాల ఉపాధ్యాయుడు యోగాలో తనకు ఆదర్శమని తెలిపింది. తన తల్లిద ండ్రుల ప్రోత్సాహం యోగాలో మరింత ముందుకు సాగే దిశగా తీసుకెళ్లిందని పేర్కొంది.



డిసిసి చైర్మన్‌గా నియమితులైన అమాస రాజశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన తిరుపతి టిడిపి సీనియర్ నాయకులు కందాటి సురేష్, జెడబ్ల్యూ విజయ్‌కుమార్, సత్యవతి, చల్ల షణ్ముగం, మల్లెపూల బాలు, రామచంద్రారెడ్డి. - ప్రభాతవార్త, తిరుపతి

## శేషవాహనంపై అగస్త్యేశ్వరుని ఘనంగా ఊరేగింపు



నారాయణవనం, మే 4 ప్రభాతవార్త : మండలంలోని సముదాయం గ్రామంలో ప్రసిద్ధి చెందిన టిటిడి అనుబంధ ఆలయం మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో నాల్గవరోజు ఆదివారం రాత్రి పురవీధుల్లో శేషవాహనాన్ని అదిరోహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అంతకుముందు ఆలయంలో శుద్ధి, నిత్యకైంకర్య పూజా కార్యక్రమాల అనంతరం వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. స్వామి, అమ ్మవారి ఊరేగింపు సందర్భంగా టిటిడి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కళాకారులు కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే అన్నమయ్య ప్రాజెక్టు ఆద్వర్యంలో సంకీర్తలు, హరికథలను వినిపించారు. భక్తులు అడుగడుగునా టెంకాయహరతులు, నైవేద్యం సమర్పించు కున్నారు. టిటిడి అధికారులు భక్తులకు ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎఇఓ రవి, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, అర్చకులు రమేష్ గురుకుల్, రమణిగురుకల్, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం



పాకాల, మే 4 ప్రభాతవార్త : మండలం పాకాల బందుల దొడ్డి వీధిలోని కరెంటు పోల్ కింద భారీగా చెట్టు పెరిగి కరెంటు తీగలను ఆనుకొని స్తంభాన్ని పూర్తిగా చుట్టుముట్టి ంది. పెను ప్రమాదం పొంచి వున్నప్పటికీ ఏ ఒక్క విద్యుత్ అధికారి కూడా స్పందించకపోవడం బాధాకరం. ఓ మోస్తరు గాలికి కూడా తరచూ ఈ లైన్‌లు ఒక లైన్‌కు మరొక లైన్ రాసుకొని ఈ వీధిలో గత కొంత కాలం నుంచి కరెంటు సరఫరాలో తీవ్ర అంతరాయాలు ఏర్పడుతున్నా ఇప్పటికి ఈ సమస్యలను క్షేత్రస్థాయి సిబ్బంది పట్టించుకోక పోవటం వీరి నిర్లక్ష్య వైఖరికి నిలువెత్తు నిదర్శనం అని స్థానిక ప్రజలు, బిజెపి వెంకటాద్రి నాయుడు అంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇలాంటి సమస్యలను గుర్తించి సత్వరం పరిష్కరించవలసినదిగా వారు కోరుతున్నారు.

# గూడూరు డివిజన్

## సాయి బాబా ఆరాధన మహోత్సవాలు



గూడూరు, మే 4 ప్రభాతవార్త : పట్టణంలోని కుమ్మరి వీధిలో ఉన్న ప్రేమ సుధ సత్య సాయి మందిరం నందు భగవాన్ శ్రీసత్య సాయి బాబా ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని సమితి కన్వీనర్ దామ ప్రతాప్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సత్య సాయి బాబా 24వ తేదిన తనువు చాలించారని అప్పటి నుండి ప్రేమసుధ మంది రంలో కొన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు, తోటి యువత, చిన్నారులకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం సమ్మర్ క్యాంపు ఉదయం నుండి నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్.ఎస్ సొసైటీ జాయింట్ సెక్రెటరీ ఎస్.ఎల్.వి సురేష్ బాబు, బాల వికాస్ గురువులు గౌతమి, సునంద, సేవా దళ్ ఇన్చార్జి మల్లికార్జునరావు, సుబ్బారావు, ఆనందలు పాల్గొన్నారు.

## నేదురుమల్లితో నాయకులు సమావేశం



వాకాడు, మే 4 ప్రభాతవార్త : వాకాడులో నేదురుమల్లి నివాసంలో వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డితో ఆదివారం కోట వాకాడు, చిట్టమూరు మండలాల నాయకులు సమావేశం అయ్యారు. గూడూరు నియోజవర్గంలోని కోట వాకాడు చిట్టమూరు మండలాల నాయకులతో ఆయన మాట్లాడుతూ సంవత్సరం కాలం పాటులో అభివృద్ధి శూన్యమని అన్నారు. చెప్పిన వాగ్దానాలు కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కేశారు అన్నారు. ప్రజలు ఇప్పటికే కూటమి ప్రభుత్వాన్ని పై పలు సందేహాలు వచ్చేసేయ్ అన్నారు. జగన్మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి చేయాలని ఉద్దేశంతో ప్రజలు ఇప్పటికే అర్థం చేసుకున్నారన్నారు, ఎన్నికలు ఎప్పుడు వస్తాయని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఇప్పటినుంచి వైయస్సార్‌సిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు వద్దనే ఉండాలన్నారు. ప్రజలు సమస్యలపై వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు స్పందించాలని, ఇప్పటి నుంచే పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలిసి పని చేయాల్సిన అవసరం వచ్చింది అన్నారు. ఈ సమావేశంలో వాకాడు ఉప సర్పంచ్ పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఏఎంసి మాజీ డైరెక్టర్ వాకాటి జనార్ధన్‌రెడ్డి, నేదురుమల్లి హిమ కుమార్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి, కేతంరెడ్డి సురేంద్రరెడ్డి, కోట వాకాడు చిట్టమూరు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన బాలుడు మృతి



తడ, మే 4 ప్రభాతవార్త : గత నెల 29న తడ మండలం వాటంబేడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన తమిళనాడులోని బాటకుప్పం బాలుడు దేశప్పన్ (14) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ఆరంబాకం సమీపంలోని బాట కుప్పానికి చెందిన శివలింగం, దేశప్పన్‌లు మోటార్‌బైక్‌పై వెళుతూ అతివేగంగా రోడ్డు టర్నింగ్ పాయింటు వద్ద జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని అప్పట్లో సూళ్లూరుపేటలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలించారు. అక్కడే దేశప్పన్ మృతిచెందినట్లు తండ్రి కుప్పురాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శివలింగం చెన్నైలోనే చికిత్స పొందుతున్నాడు. ఎస్ఐ కొండప్పనాయుడు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మినీ గోకులం.. బిల్లులకు ఎంత కాలం

**- నాలుగు నెలలుగా పాడి రైతులు నిరీక్షణ**

కోట, మే 4 ప్రభాతవార్త : ప్రభుత్వం హామీతో వేలాది రూపాయలు ఖర్చు చేసి మినీ గోకులాలు నిర్మించుకున్న పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 90 శాతం రాయితీ వస్తుందనే నమ్మకంతో వడ్డీకి డబ్బులు తెచ్చి రైతులు మినీ గోకులాలు నిర్మించారు. కోట మండలంలో 58 మినీ గోకులాలను రైతులు నిర్మించుకున్నారు. లబ్ధిదారులందరూ పేదలే కావడంతో వారి పాలిట శాపంగా మారింది. ప్రభుత్వం తమకు అప్పగించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు పశు సంవర్ధకశాఖ అధికారులు నిర్మాణాలు పూర్తి చేయించి చేతులు దులుపుకున్నారు. వీరిని నమ్మి మినీ గోకులాలు నిర్మించిన పాడి రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం లభించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి సమస్యను ప్రభుత్వానికి నివేదించాలని పాడి రైతులు కోరుతున్నారు. బిల్లుల చెల్లింపులో అలసత్వంతో నరేగా కింద పలు పనులు అసంపూర్తిగా నిలిచిపోవడం గమనార్హం. గత నాలుగు నెలలుగా బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి నిర్మాణం చేపట్టిన రైతులు లబోదిబోమంటున్నారు.

## వరి నాటులో బిజీ...బిజీ



విజయపురం, మే 5 ప్రభాతవార్త: మండలంలో వరి నాటులో రైతులు బిజీ అయిపోతున్నారు. మండలంలో విస్తారంగా వరినాటు వేస్తున్నారు. మండలంలోని చెంగమనాయుడు కండ్రిగ, మంగళం, కళియంబాకం, మాధవరం, పన్నూరు ప్రాంతాల్లో వరినాటు వేస్తున్నారు. తెల్లగుంట ప్రాంతాల్లో ఒడిసా నుంచి వచ్చిన కూలీలు(పురుషులు) వరినాటు వేస్తూ బిజీగా ఉంటున్నారు. ఆలపాకం ప్రాంతాల్లో స్థానికంగాలభించే కూలీలు(మహిళలు) వరినాటు వేస్తూ బిజీగా ఉన్నారు.

## శివయ్యసేవలో చినరాజప్ప పూజలు



శ్రీకాళహస్తి,మే 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వెలసిన వాయులింగేశ్వరుని ఆదివారం పెద్దాపురం శాసనసభ్యుడు నిమ్మకాయల చినరాజప్ప దర్శించుకున్నారు. ఆయనకు ఆలయమర్యాదలతో తెలుగుదేశం నాయకుడు పొన్నారావు సారధ్యంలో దేశం కార్యకర్తలు స్వాగతం చెప్పారు. ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఎఇఓ సతీష్‌మాలిక్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న ఆయనకు మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వాగతం ఏర్పాటు చేసిన వారిలో పొన్నారావుతో పాటు ప్రకాష్‌నాయుడు ఉన్నారు.

# భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేసిన భక్తులు



వెదురుకుప్పం, మే 4 ప్రభాతవార్త : మండలంలోని చవటగుంట మహాభారతం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన దుర్యోధన వధ పలువురిని అలరించింది. మహాభారత ఇతిహాస గాథలో కురుక్షేత్ర సంగ్రామంలో శత సహోదరులను, సర్వసైన్యంను, బంధువులను, గురువులను అందరిని యుద్ధంలో పోగొట్టుకున్న దుర్యోధనుడు శమంతక మడుగులో దాక్కోవడం జరుగుతుంది. ఈ ఘటంను శ్రీవెంకటేశ్వర నాట్యకళామండలి కళాకారులు అద్భుంగా ప్రదర్శించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. బటిజమొండి వెంగనపల్లెకు చెందిన ఈశ్వయ్య భీముడు పాత్ర, పీలేరుకు చెందిన మురళి దుర్యోధన పాత్రలు పోషించారు. దుర్యోధన బొమ్మ మట్టి పిలకలు ఇంటిలో ఉంచుకోవడం వలన ధాన్యం,ధనం పెరుగు తాయని ప్రతీతి ఉండటంతో జనం పోటీపడ్డారు. దుర్యోధన వధ కార్యక్రమంకు ఉభయదాతలుగా మారేపల్లెకు చెందిన కసాయి సుబ్రమణ్యం విశ్రాంతి కండక్టర్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. పట్టాభిషేకం కార్యక్ర మంకు మాజీ ధర్మకర్త పేట రామచంద్రారెడ్డి కుమార్తెలు నందకుమారి, గీతకుమారి లు వ్యవహరించారు. కాపుమొండి వెంగనపల్లె గ్రామస్థులు అగ్నిగుండ ప్రవేశంకు కావలసిన సామాగ్రి సిద్ధం చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మేళాతాళల మధ్య ఊరేగింపుగా అమ్మవారి, పంచపాండవుల ఉత్సవమూర్తులను అగ్నిగుండ ప్రవేశం వద్దకు తీసుకువచ్చి పూజలు నిర్వహించి భకిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మికర్తలు పేట రాధాకృష్ణారెడ్డి, కార్యనిర్వహకులు ఆంజనేయులు ఒడ్డి, కృష్ణారెడ్డి, కొండారెడ్డి, రామయ్య, నరసింహారెడ్డి, జయరాం, ఆనందరెడ్డి, ప్రకాష్, పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.